## ముగిసిన గోవిందరాజుని జ్యేష్టాభిషేకాలు

తిరుపతిటౌన్, జులై 18ప్రభాతవార్త:



తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షణకు మూడురోజుల పాటు జరిపించిన జ్యేష్టాభిషేకాలు గురువారం ముగిశాయి. చివరిరోజు ఉత్సవమూర్తులకు బంగారుకవచాలు సమర్పించడంతో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవమూర్తులకు ఉన్న బంగారు కవచాలు తొలగించి రోజుకో కవచం ధరింపజేస్తారు. మళ్ళీ మూడవరోజు బంగారుకవచంలోనే ఉత్సవమూర్తులను అలంకరింపజేసి ఏడాదిపూర్తిగా అలాగే ఉంచుతారు. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నారాయణ, మోహనరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## కపిలేశ్వరుని పవిత్రోత్సవాలు ఆరంభం

తిరుపతిటౌన్, జులై 18ప్రభాతవార్త:

తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో గురువారం పవిత్రోత్సవాలు వేడుకగా ఆరంభమయ్యాయి. కపిలేశ్వరస్వామి, కామాక్షిఅమ్మ, విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరిజలంతో సుగంధద్రవ్యాలతో విశేషంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.



### చంద్రగిరి ఓటరు లిస్టులపై

# సిఐడి ఆరా!

**-తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డిని ప్రశ్నించిన సి.ఐ.డి అధికారులు**

**-ఉన్నతాధికారుల అనుమతితో డేటా అప్పగిస్తానన్న ఆర్డీఓ**




తిరుపతిరూరల్, జూలై 18 ప్రభాతవార్త:

చంద్రగిరి నియోజకవర్గం ఓటర్ల లిస్టు అవకతకల కుంపటి రంగులుతూనే ఉంది. సి.ఐ.డి అధికారుల రంగ ప్రవేశంతో ఓటరు జాబితా వివాదం మరింత వేడెక్కింది. చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఎన్నికల ముందు నుండి టిడిపి నాయకులు పులివర్తి నాని, ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి ఆరోపిస్తూ వస్తున్న విషయం తెల్సిందే. ఓటరు జాబితా చోటు చేసుకున్న అక్రమాలపై ఎమ్మెల్యే పులివర్తి నాని ఫిర్యాదుపై ప్రభుత్వం సి.ఐ.డి. విచారణకు ఆదేశించింది. ఓటరు జాబితాలో అవకతవకలను ప్రోత్సహించినట్లుగా అభియోగాలు ఎదుర్కొంటున్న అధికారులను ఒక్కొక్కరినిగా సి.ఐ.డి. అధికారులు ప్రశ్నించారు. ఇదివరకే ఆర్డీఓ కార్యాలయ సిబ్బందిని, తుడ వి.సిని ప్రశ్నించిన విషయం తెల్సిందే. గురువారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ నిషాంత్‌రెడ్డిని సి.ఐ.డి అధికారులు ప్రశ్నించారు. ఓటరు జాబితాలో చోటు చేసుకున్న పరిణామాలపై విచారించి, పూర్తి ఓటరు జాబితా ఇవ్వాలని సి.ఐ.డి. అధికారులు ఆర్డీఓ నిషాంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. ఓటరు జాబితాలో దొంగ ఓట్లు నమోదైనాయా! డబుల్ ఎంట్రీలు ఎందుకు తొలగించలేదు, మరణించివారి ఓట్లను ఎందుకు తొలగించలేదు. నియోజకవర్గం నుండి బదిలీ అయిన ఓటర్లను ఓటరు లిస్టు నుండి ఎందుకు తొలగించలేదు అనే ప్రశ్నలు స్పందించినట్లు సమాచారం. సి.ఐ.డి. అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకు ఆర్డీఓ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం, కలెక్టరు అనుమతితో పూర్తి డేటా అందజేస్తానని ఆర్డీఓ తెలిపినట్లు సి.ఐ.డి అధికారులు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గం ఓటరు లిస్టులో భారీగా అవకతవకలు జరిగాయని ఎమ్మెల్యే పులివర్తి నాని గత జనవరి 8న తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి, అమరణ నిరాహారదీక్షకు పూనుకొనడమే కాకుండా దీక్షకు భగ్నం చేసారని, ఒంటిపై పెట్రోల్ పోసుకున్న విషయం తెల్సిందే. అప్పట్లో పలుమార్లు టిడిపి నాయకులు ధర్నాలు, ఫిర్యాదులు చేసిన పట్టించుకోని అధికారులు టిడిపి అధికారంలోకి రాగానే విచారణ పుంజుకుంది. గత 5సంవత్సరాల కాలంలో చంద్రగిరి నియోజకవర్గంలో పని చేసిన తహశీల్ధార్స్‌ను, లిటరు లిస్టు అక్రమాలను ప్రోత్సహించిన ఉన్నతాధికారులను సి.ఐ.డి అధికారులు ప్రశ్నించనుట్ల సమాచారం. ఈ విచారణలో సి.ఐ.డి డియస్పీ పద్మలత, సి.ఐ రామ్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# పుంగనూరులో ఉద్రిక్తత

**మాజీ ఎంపి ఇంటికి వచ్చిన ఎంపి మిథున్‌రెడ్డి-చుట్టుముట్టిన తేదేపా నాయకులు కార్యకర్తలు**

**-పరస్పరం రాళ్ళదాడి -మాజీ ఎంపి కారు దగ్ధం -మొహరించిన పోలీసులు**

**గన్‌మెన్ రెండు రైండ్లు గాలిలోకి కాల్పులు**



ధ్వంసమయిన ఎంపి మిథున్‌రెడ్డి వాహనం, కాలుతున్న మాజీ ఎంపి రెడ్డెప్ప వాహనం, రెడ్డెప్ప ఇంటి వద్ద వైకాపా నాయకులు, రాళ్లు రువ్వుతున్న ఆందోళనకారులు

పుంగనూరు(చౌడేపల్లి), జూలై 18 ప్రభాతవార్త

పుంగనూరులో గురువారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చిత్తూరు మాజీ ఎంపి ఎన్.రెడ్డెప్పను కలవడానికి రావడంతో గోబ్యాక్ మిథున్‌రెడ్డి అంటూ రైతులు, కూటమి రైతులు నిరసనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ రైతులు, ఊర్లోకి ఎలా వస్తారని కూటమి నాయకులు ఇంటిని చుట్టుముట్టారు. ఈ సందర్భంగా తేదేపా, వైకాపా పరస్పర దాడులతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఎటు చూసినా ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు రాళ్ళు రువ్వుకోవడం, కుర్చీలతో కొట్టుకోవడం కనిపించింది. ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కారుతోపాటు మరో 5వాహనాలు ధ్వంసం కాగా చిత్తూరు మాజీ ఎంపి ఎన్.రెడ్డెప్ప వాహనాన్ని పెట్రోలు పోసి నిప్పంటించారు. పోలీసులు భారీగా మొహరించి ఆందోళన కారులను చెదరగొట్టడంతో పరిస్థితి సద్దుమణిగింది. చిత్తూరు మాజీ ఎంపి ఎన్.రెడ్డెప్ప ఇంటికి ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఉదయాన్నే చేరుకొన్నారు. ఇటీవల పుంగనూరులో జరిగిన పలు అంశాలను గురించి, గాయపడ్డ వైకాపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరుపుకొన్నారు. అయితే అప్పటికే తేదేపా నాయకులు, కార్యకర్తలు మాజీ ఎంపి రెడ్డెప్ప ఇంటి వద్దకు వచ్చి మిథున్‌రెడ్డి గోబ్యాక్ అంటూ నినాదాలు చేసారు. అంతే కాకుండా రైతులకు ఇవ్వాల్సిన నగదు ఇవ్వాలంటూ కోపోద్రేకంగా నిరసనకు దిగారు. ఇంటి ముందు నుంచి కొందరు వ్యక్తులు మాజీ ఎంపి రెడ్డెప్ప ఇంటిపైకి రాళ్ళు రువ్వుతూ కుర్చీలను గాల్లోకి ఎగరేశారు. ఈ దాడిలో పలువురు పోలీసులు, మీడియా ప్రతినిధులు సైతం గాయపడ్డారు. ఈ క్రమంలో ఎంపి మిథున్‌రెడ్డి గన్‌మేన్‌లు 3సార్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అయినా ఆ ప్రాంతంలో ఉద్రుత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చేసేది లేక పోలీసులు టీయర్ గ్యాస్‌ను ఉపయోగించి ఆందోళన కారులను చెల్లా చెదరు చేసారు. ప్రశాంతంగా వున్న పుంగనూరు వాతావరణాన్ని రాజకీయ కక్షలతో కార్చిచ్చు పెడుతున్నారని విశ్లేషకులు బహిరంగంగానే విమర్శించడం కనిపించింది.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు

తవణంపల్లె, జూలై 18 ప్రభాతవార్త:

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం సమీపంలోని వ పొలాల్లో గుప్పనిధుల కోసం తవ్వకాలు చేసిన ఆరుమందిని బుధవారం తవణంపల్లె పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి ఒక కారును తవ్వకాల కోసం ఉపయోగించిన పనిముట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అనిల్‌కుమార్ కథనం మేరకు మండలంలోని అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంకు దక్షిణ వైపున అరగొండ పూర్ణచంద్రారెడ్డి మామిడితోటలో పురాతనమైన గుండుపై చెక్కబడిన వినాయకుని ప్రతిమకు సుమారు 20 అడుగుల దూరంలో గుప్పనిధులు వున్నాయన్న నమ్మకంతో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళ్యంకు చెందిన బిట్రగుంట దాసయ్య(53), ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కంచర్ల శ్రీనివాసులు(55), వెంకటగిరి చెందిన శశికుమార్(52), శ్రీకాళహస్తి చెంచులక్ష్మి కాలనీకి చెందిన టి.వేలు(44), ఆర్.రామ చంద్రియన్(44), ఇ.వెంకట్రామయ్య(65) అనే వ్యక్తులు బుధవారం తవ్వకాలు నిర్వహించారు. పట్టుబడిని ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

## ఇన్‌ఛార్జి ఉపకులపతులుగా సీనియర్లు నియామకం

**-పద్మావతికి ఆచార్య ఉమ, ఎస్వీయూకు ఆచార్య అప్పారావు,**

**విక్రమసింహపురికి విజయభాస్కరరావు**



తిరుపతి టౌన్, జులై 18ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని మూడు విశ్వవిద్యాలయాలకు అదే విశ్వవిద్యాలయాల్లో అనుభవజ్ఞులైన, సీనియర్ ఆచార్యులను ప్రభుత్వం ఇన్‌ఛార్జి ఉప కులపతులుగా నియమించింది. గురువారం సాయంత్రం ప్రభుత్వం ఇన్‌ఛార్జి ఉపకులపతులను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఎంతో ప్రతిష్టాత్మకమైన శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయం ఉపకులపతికి బయోటెక్నాలజీ విభాగానికి చెందిన సీనియర్ ఆచార్యులు, పార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్.అప్పారావు నియమితులయ్యారు. నేడు ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య వి.ఉమ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఆమె సోషియల్ వర్క్‌విబాగంలో సీనియర్ ఆచార్యులు. గతంలో ఆమె ఇన్‌ఛార్జి ఉపకులపతిగా, రెక్టార్‌గా పనిచేసిన అనుభవం, విద్యాప్రమాణాలు మెరుగుపరచడంలో అవగాహన కలిగి ఉన్నారు. ఆమె గత అనుభవం దృష్ట్యా ఇన్‌ఛార్జి ఉపకులపతిగా తగిన రీతిలో సమర్ధవంతమైన బాధ్యతలు నిర్వహిస్తారని ప్రభుత్వం అవకాశం కల్పించింది. అంతేగాక తిరుపతి ఎస్వీయూలో భౌతికశాస్త్ర సీనియర్ ఆచార్యులు విజయభాస్కరరావును నెల్లూరు విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమితులయ్యారు. మరీ రానున్న మూడునెలల వరకు వీరే ఇన్‌ఛార్జి ఉపకులపతులుగా బాధ్యతలు నిర్వహిస్తారు. వీరి పరిపాలన, విద్యాప్రమాణాలు మెరుగుపరచడం, అనుభవం బట్టి ప్యానల్ కమిటీ సూచించే పేర్లలో వీరి పేర్లు పూర్తిస్థాయిలో ఉపకులపతులుగా గవర్నర్ నియామకంలో ఉండే అవకాశం లేకపోలేదు.

## ద్రవిడ వర్సిటీ ఇన్‌చార్జ్ వి.సి.గా ప్రొఫెసర్ దొరస్వామి నియామకం

కుప్పం, జూలై 18 ప్రభాతవార్త



ద్రవిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ ఉపకులపతిగా ప్రొఫెసర్ ఎం.దొరస్వామిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ దొరస్వామి ప్రస్తుతం ద్రవిడ విశ్వవిద్యాలయం గ్రంథాలయం మరియు ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ మరియు హెడ్‌గా పనిచేస్తున్నారు. ప్రొఫెసర్ దొరస్వామి తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ పిజి కోర్సును 1991లో పూర్తి చేశారు. అలాగే 1995లో ఎంఎల్ఐఎస్‌సిను తిరుపతి ఎస్వీయు నుంచి పూర్తి చేశారు. 2000సం॥లో అన్నామలై యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పట్టా పొందారు. కాగా నూతన ఇన్‌చార్జ్ విసిగా ప్రొఫెసర్ ఎం. దొరస్వామి నియామకం పట్ల స్థానికులు, ద్రవిడ వర్సిటీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. కాగా విసిగా నియమితులైన ప్రొఫెసర్ దొరస్వామి శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టనున్నట్లు 'ప్రభాతవార్త'కు తెలిపారు. వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

### కుప్పం రెస్కో అవకతవకలపై గడువులోపే

# సమగ్ర విచారణ పూర్తి చేస్తాం

**అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి**

**ముప్పై అంశాలపై పలువురు ఉద్యోగుల్ని విచారణ.. రికార్డుల పరిశీలన !!**



రెస్కో ఉద్యోగులను విచారిస్తున్న అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి

కుప్పం, జూలై 18 ప్రభాతవార్త

కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) పరిధిలో చోటు చేసుకున్న అవకవకతలపై నాలుగు నెలల గడువు ఇచ్చారని అయితే ఆ గడువులోపే సమగ్ర విచారణ పూర్తి చేస్తామని సహకార సంస్థల అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. గుంటూరు నుంచి విచ్చేసిన అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి గురువారం కుప్పం రెస్కో ప్రధాన కార్యాలయంలో జిల్లా సహకార అధికారి నాగవర్ధన, సూపరింటిండెంట్ కిషోర్‌కుమార్, సహాయ రిజిస్ట్రార్ ఆరిఫుల్లాల సమక్షంలో రెస్కోలో చోటు చేసుకున్న అవకవతకలపై విచారణ చేపట్టారు. ఉదయం పదకొండు గంటలనుంచే ముప్పై అంశాలపై అదనపు రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి రెస్కో ఉద్యోగులను విచారించారు. రెస్కో పరిధిలో వచ్చిన అభియోగాలు, నోటిఫికేషన్లు లేకుండా ఉద్యోగాల కల్పన, 2010నుంచి చేపట్టిన ఆర్థిక లావాదేవీలు, ఉద్యోగులకు చెల్లించిన ఇంక్రిమెంట్లు, ఆరోగ్యపరమైన బిల్లుల చెల్లింపు, ఉద్యోగుల పదోన్నతులు, సంస్థ బైలా, సంస్థ జనరల్ బాడీ సమావేశాల మినిట్స్ పుస్తకాలు, తీర్మానాలు, సంస్థ బడ్జెట్, వ్యయాలు, 2019-20లో సంస్థకు ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు, విత్‌డ్రాల వివరాలు, కేంద్ర ప్రభుత్వం యొక్క దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన పథకంలో భాగంగా 2016-20మధ్య చేపట్టిన పనులు, కేంద్రం నుంచి మంజూరైన నిధులు, రెస్కో ఉద్యోగుల టిఎ, డిఎల వివరాలు రెస్కో పరిధిలో చేపట్టిన ఉద్యోగాలకు సంబంధించి ఇచ్చిన అడ్వర్‌టైజ్‌మెంట్లు, నియామకాలకు సంబంధించి అనుమతుల రికార్డులు తదితర అంశాలపై విచారించారు. అనంతరం ఆమె 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. రెస్కోలో చోటు చేసుకున్న అవకతవకలపై సహకార సంస్థల కమీషనర్ ఆదేశాల మేరకు తాను గుంటూరు నుంచి విచారణకు వచ్చినట్లు తెలిపారు. రెస్కో పరిధిలో ముప్పై అంశాలకు సంబంధించిన రికార్డులు పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశాలకు సంబంధించి అవసరమైన అందరినీ విచారిస్తామని పేర్కొన్నారు. పూర్తిస్థాయి విచారణకు నాలుగు నెలల గడువును కమీషనర్ ఇచ్చారని అయితే సాధ్యమైనంత త్వరగా రెండు నెలల్లోపే విచారణను సమగ్రంగా చేపట్టి పూర్తి నివేదికను కమీషనరుకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో రెస్కో ఎండి సోమశేఖర్, డిఇ మదన్‌మోహన్, సీనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, రెస్కో ఎడిలు పాల్గొన్నారు.

### దక్షిణ కైలాసంలో

## దక్షిణామూర్తికి విశేషాభిషేకాలు



శ్రీకాళహస్తి, జూలై 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవతల పూజలు, అభిషేకాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపధ్యంలో ఆలయంలో వెలసిన గురుదక్షిణా మూర్తికి గురువారం విశేషాభిషేకాలు, అలంకారాలు నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులు కావటంతో ఆలయానికి భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరౌతున్నారు. ఈ నేపధ్యంలోనే హుండీల ఆదాయాలు గణనీయంగా పెరుగుతుంది. గతంలో నెలకు లక్షల్లో వస్తున్న హుండీ రాబడి నేడు కోట్లుకు పెరిగింది. వారంలో ప్రతి రోజూ ఒక ప్రత్యేకత సంతరించుకకుంటుంది. ఈ నేపధ్యంలో ఆలయంలోని కంచుగడప వద్దకు చేరగానే భక్తులకు దర్శనమిచ్చే స్వామి గురుదక్షిణామూర్తి ఆ ఆలయం వద్ద గురువారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు ప్రదానార్చకులు కరుణాకర్ గురుకుల్ నిర్వహించారు.

# కాణిపాకంలో అంతర్గత బదిలీల వివాదం

**-నిబంధనలకు తూట్లు : కమీషనర్ ఆదేశాలు బేఖాతర్**

**-రెండు నెలలు తిరక్కుండానే మళ్ళీ బదిలీలు**

కాణిపాకం, జూలై 18 ప్రభాతవార్త:



సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో చేపట్టిన ఉద్యోగుల అంతర్గత బదిలీలు అయినవారికి ఆకుల్లో కానివారికి కంచాల్లో అన్న చందంలో వున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిపాలనా సౌలభ్యం పేరుతో ఎన్నికల వేళ ఆలయ అధికారులు హడావుడిగా చేపట్టిన అంతర్గత బదిలీలు కొందరికి మోదం మరి కొందరికి ఖేదం అన న్నట్లుగా వున్నాయని ఉద్యోగుల నుండి పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. అలాగే అంతర్గత బదిలీలు జరిగి రెండు నెలలు కూడా పూర్తి కాకుండానే మరోమారు గురువారం ఉద్యోగులు, సిబ్బంది అంతర్గత బదిలీలు నిర్వహించడం వివాదాలకు తావిస్తోంది. దేవస్థానంలో అవినీతి అక్రమాలు జరుగకుండా పారదర్శకమైన పాలన సాగే విధంగా వుండేందుకు ఆలయ ఉద్యోగులు, సిబ్బందిని ప్రతి మూడు నెలల కొకసారి అంతర్గత బదిలీలు చేపట్టాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ గతంలో ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు దేవస్థానంలో పనిచేసే ఏఈఓల నుండి అటెండర్ వరకు ఉద్యోగులతో పాటు అర్చకులను ప్రతి మూడు నెలలకు ఒకసారి అంతర్గతంగా బదిలీలు చేయాల్సి వుంది. అయితే సుమారు ఐదు నెలలుగా అంతర్గత బదిలీలు చేపట్టకుండా వున్న ఆలయ ఉన్నతాధికారి ఎన్నికల వేళ గత మేనెల చివరి వారంలో ఉన్నపళంగా అంతర్గత బదిలీలు చేపట్టడం అప్పట్లో వివాదాస్పదమయ్యాయి. ఈసందర్భంగా తనకు అయిన వారిని, తనకు అనుకూలంగా వున్న వారిని అనుకున్న చోట్లకు బదిలీ చేసి మిగతా వారిని నెలల తరబడి ప్రాధాన్యత లేని చోట్లనే వుంచారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే గురువారం దేవస్థానంలో పనిచేసే 36 మంది ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డెయిలీ వేజెస్, ఎన్ఎంఆర్ తదితర చిన్నస్థాయి కేడర్‌లో వున్న వారిని రెండు ఆఫీస్ ఆర్డర్ల ద్వారా అంతర్గత బదిలీలు చేస్తూ విధులు కేటాయించారు. ఈబదిలీలు కూడా తనకు వేగులుగా వున్న వారిని, స్థానికంగా రాజకీయ నాయకుల అండదండలు వున్న వారికి ప్రాధాన్యత ఉన్న స్థానాల్లో, మిగిలిన వారిని ప్రాధాన్యత లేని స్థానాలకు బదిలీలు చేశారని ఉద్యోగుల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కమీషనర్ ఆదేశాల మేరకు ఉద్యోగులు, అర్చకులు, సిబ్బందిని అందరిని అంతర్గత బదిలీలు చేయాల్సి వున్నప్పటికి కొంత మందిని మాత్రమే బదిలీలు చేసి మిగతా వారిని ఎందుకు బదిలీ చేయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా వుండగా దేవస్థానంలో కీలకమైన దర్శన టిక్కెట్ విక్రయకేంద్రాలు, ఆర్జిత సేవా టిక్కెట్ విక్రయ కేంద్రాలు, ఆర్ధికపరమైన లావాదేవీలు నిర్వహించే స్థానాల్లో అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, డెయిల్ వేజెస్ సిబ్బందిని నియమించడం కూడా పలు విమర్శలకు తావిస్తోంది. కౌంటర్‌లలో ఏదైనా అవినీతి అక్రమాల, జరిగితే సంభందిత సిబ్బందిపై ఏవిధమైన చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. తాజాగా స్వయానా రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ కక్ష్యకట్టి తమను అంతర్గత బదిలీల పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆలయ అభివృద్ధి కోసం నిజాయితీగా పనిచేసిన తమను ఆలయ అధికారులు కక్ష్యకట్టి ప్రాధాన్యత లేని చోట్లుకు బదిలీ చేశారని వారు ఆరోపిస్తున్నారు. దీనితో కొంత మంది దీర్ఘకాలిక సెలవులో వెళ్ళాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## మామిడితోటల్లో కొమ్మ కత్తరింపు చేపట్టాలి

-జిల్లా ఉద్యాన అధికారి



తవణంపల్లె, జూలై 18 ప్రభాతవార్త: మామిడి తోటల్లో కాయల కోత అనంతరం కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి డి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని అరగొండ శ్రీగౌరీ శంకర కళ్యాణ మండపంలో మామిడి తోటల్లో కాయల కోత అనంతరం చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై శిక్షణా నిర్వహించారు. జిల్లా ఉద్యాన అధికారి మదుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ మామిడితోటల్లో కాయల కోత అనంతరం తప్పనిసరిగా కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని సూచించారు. మామిడితోటల్లో కొమ్మ కత్తిరింపు విధానం గురించి ప్రయోగాత్మకంగా తెలియజేశారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త రెడ్డిరాము, మండల ఉద్యాన అధికారి డి.సాగరిక, మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, రైతుసేవా కేంద్రం సిబ్బంది మామిడి రైతులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో సీనియర్ జర్నలిస్టు మృతి

బంగారుపాళ్యం, జూలై 18 ప్రభాతవార్త: వివిధ పత్రికల్లో జర్నలిస్టుగా పని చేసిన జి.ప్రసాద్(56) గుండెపోటుతో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. బుధవారం సాయంత్రం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువవారం తెల్లవారుజాము మృతి చెందాడు. మృతుడుకు భార్య, ఇద్దరు కుమారులు వున్నారు. మృతదేహంకు మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, బంగారుపాళ్యం మాజీ సర్పంచ్ కృష్ణ మూర్తి, ఉప సర్పంచ్ కామరాజు, మండల టిడిపి అధ్యక్షుడు జయప్రకాష్, పలువురు నాయకులునివాళులు అర్పించారు. అలాగేమండలం లోనిపాత్రికేయులుప్రసాద్‌కుటుంబాన్నిపరామర్శించారు.

## ట్విట్టర్‌లో సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే

బంగారుపాళ్యం, జూలై 18 ప్రభాతవార్త: ట్విట్టర్ వేదికగా వచ్చిన సమస్యను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ ఒక్కరోజు వ్యవధిలోనే పరిష్కరించారు. బంగారుపాళ్యం పంచాయతీ గోవర్ధనగరి ప్రాథమిక పాఠశాల ఆవరణ పరిసరాల్లో మురికినీటితో దుర్గంధంగా వుంది. ఈ సమస్యను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్విట్టర్ ద్వారా ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ దృష్టికి తీసుకువచ్చారు. ట్విట్టర్‌లో వచ్చిన సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ మురమోహన్ సచివాలయ సిబ్బందికి ఈ విషయం చెప్పి సత్వరం పరిశీలించి సమస్యను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది గురువారం పాఠశాల పరిసర ప్రాంతంలో వున్న మురికినీటిని తొలగించి జెసిబి ద్వారా మట్టిని వీధిలో నింపారు.మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, సచివాలయ కార్యదర్శి అవంతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిషోర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వైకాపా ఐదేళ్ళ దోపిడి పాలనపై శ్వేతపత్రం

- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

చిత్తూరు టౌన్, జూలై 18 ప్రభాతవార్త: ఐదేళ్ళ వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జరిగిన దోపిడి, అక్రమాలపై సిఎం నారా చంద్రబాబు నాయుడు శ్వేతపత్రం విడుదల చేయనున్నారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు గురువారం మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గురజల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ళ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 35,576 కోట్ల రూపాయల విలువైన 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయన్నారు. అలాగే ఇళ్ళ పట్టాల పేరిట 10 వేల ఎకరాలు, ఇసుక దందా ద్వారా 9,750 కోట్ల రూపాయలను వైకాపా నాయ కులు దోపిడి చేశారన్నారు. వైకాపా ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంను రద్దు చేసి నూతన ఇసుక విధానంపేరిట20వేల మందిభవననిర్మాణ కార్మికుల నడ్డి విరిచి ఆ రంగంను అతలాకుతలం చేసిందన్నారు.

## అక్రమంగా పునాది రాళ్ళు తీసుకెళ్తున్న ట్రాక్టర్ సీజ్

చిత్తూరు టౌన్, జూలై 18 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పునాది రాళ్ళు తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను గురువారం అధికారులు సీజ్ చేశారు. పాలసముద్రం నుండి తమిళనాడు రాష్ట్రం అమ్మవారి కుప్పంకు అక్రమంగా ట్రాక్టర్‌లో పునాది రాళ్ళు తరలిస్తుండగా స్థానిక తెలుగుదేశం నాయకులు ట్రాక్టర్‌ను నిలుపుదల చేసి తహసిల్దారు సుబ్బలక్ష్మిని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసిల్దారు సుబ్బలక్ష్మి విఆర్ఓ ఆనంద్‌నాయుడును సంఘటనా స్థలంకు పంపి విచారించాలని ఆదేశించారు. ఈ మేరకు సంఘటనా స్థలంకు వెళ్ళిన విఆర్ఓ ఆనంద్‌నాయుడు రాళ్ళ సరఫరాకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు.

## కుష్టు నివారణ కార్యక్రమంపై సర్వే



సదుం, జూలై 18 ప్రభాతవార్త జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీవరకు కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంపై ఇంటింటా సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెరకువారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గిరీషా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి మైకోబాక్టీరియమ్ లెప్రి అనే బాక్టీరియా వలన వస్తుందని చెప్పారు. ఈక్రిమిలు తుమ్మడం వలన దగ్గడం వలన ఒకరి నుంచి మరోకరికి వ్యాప్తి చెందుతుందని వ్యాధి లక్షణాలు కనిపించడానికి 3 నుంచి 5 రోజులు పడుతుందన్నారు. చర్మముపై స్పర్శలేని రాగి మచ్చలు లేక పోడలు కాళ్లు,చేతులు నరాలు తిమ్మిరిగా ఉండటం, కళ్లు పూర్తిగా మూయలేకపోవడం, చెవితమ్మలు మందంగా ఉండటం తదితర లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా వైద్యం అందించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆరోగ్య పర్యవేక్షక సిబ్బంది ఉదయ్‌బాస్కర్,నీలకంఠ,జానకి,కమ్యూనిటీ హెల్త్ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగస్టు 2 వరకు ఇంటింటి సర్వే

రొంపిచెర్ల, జూలై 18 ప్రభాతవార్త ఈనెల 18 నుంచి ఆగస్టు 2 వరకు కుష్టు నివారణ కార్యక్రమంపై ఇంటింట సర్వే నిర్వహించనున్నట్లు రొంపిచెర్ల వైద్యాధికారి దినేష్‌కుమార్‌నాయక్ తెలిపారు. గురువారం రొంపిచెర్లలో ఈ కార్యక్రమంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్పర్శలేని మచ్చలు,శరీరంపై బుడిపెలు, నూనెపోసినట్లుగా జిడ్డుగా ఉండటం చేతి వేళ్ల వంగిపోవడం, ముక్కు, చెవులు వంగిపోవడం లాంటి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయ్యాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా చికిత్స అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్ఓ కాంతమ్మ, ఎంపీహెచ్ఎస్ పంకజం,టీబీ సూపర్‌వైజర్ లక్ష్మీపతి,ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 21న గురుపౌర్ణమి వేడుకలు

సదుం, జూలై 18 ప్రభాతవార్త సదుం గాంధీరోడ్డులోని శ్రీషిరిడీసాయిబాబా మందిరంలో ఈనెల 21న గురుపూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు నాగబూషణరెడ్డి తెలిపారు. ఉదయం కాకడ హారతి, అనంతరం 7గంటల నుంచి పాలాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం సాయి భజన, మధ్యాహ్నం మధ్యాహ్నహారతి, సాయంత్రం దూప్‌హారతి, రాత్రి శేజ్‌హారతి ఉంటాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి నిరంతరాయంగా అన్నదానం ఉంటుందన్నారు.

## విద్యాభివృద్ధి టిడిపి ధ్యేయం



గంగాధర నెల్లూరు జూలై 18 ప్రభాత వార్త: విద్యాభివృద్ధి తెలుగు దేశం పార్టీ ధ్యేయం అని స్థానిక ఎమ్మెల్యే విఎం థామస్ అన్నారు.గురువారం మండల పరిధిలోని నెల్లెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా బోధన కిట్ల పంపిణి కార్యక్రమంలో ఈయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను మెరుగులు దిద్ది సాకేతిక నాణ్యమైన విద్య బోధన కోసం నారా లోకేష్ మరింతగా కృషి చేస్తున్నారని దీనిలో భాగంగానే మండలంలోని 4048 మంది విద్యార్థులకు 92 లక్షల విలువ చేసే కిట్లలను పంపిణీ చేయడం జరిగిందన్నారు.అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలహామీలు నెరవేర్చడం చూస్తుంటే సూపర్ సిక్స్ కాకుండా సూపర్60 స్పీడ్‌లో వెళుతున్నదని అన్నారు. రాష్ట్రం పీకల్లోతు నష్టంలో ఉన్న పేదలకు అందించే సంక్షేమ పథకాలను అమలు చేయడం హర్షనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేకర్ ఎంఈఓలుఅంజనేయులు శెట్టి,గుణశేఖర్ రెడ్డి,ప్రదానోపాద్యాయులు సుబ్బలక్ష్మీ,యుగంధరాచారి,సర్పంచ్ గంగయ్య,నాయకులు దేవసుందరం, శ్రీధర్ యాదవ్,జోతీశ్వర్ రెడ్డి. మునిరాజులు,జ్యోతి యాదవ్,రాజేష్,ప్రకాష్ నాయుడు, ప్రభాకర్ నాయుడులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా వి.నరసింహాశర్మ ఎన్నిక

**గంగాధర నెల్లూరు జూలై 18 ప్రభాత వార్త:** ఇటీవల బంగారుపాళ్యం మండల మొగిలి శివాలయ ఆవరణలో నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా పురోహిత బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గ ఎంపికలో భాగంగా మండలంలోని బాలగంగన పల్లె గ్రామ పురోహితులుగా ఉన్న వరలేకరి నరసింహ శర్మను జిల్లా ఉపాధ్యక్షుడిగా రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల పట్ల మండలంలోని పురోహితులు హర్షం వ్యక్తం చేశారు. నరసింహ శర్మ నాపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు పురోహిత సంఘ సమాఖ్య అభివృద్ధి కోసం తన వంతు సాయం ఎల్లవేళలా ఆయన తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రతి సమస్య పరిష్కారానికి కృషి

- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పనులు చేపట్టి పూర్తి చేస్తాం

- డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు



చిత్తూరు టౌన్, జూలై 18 ప్రభాతవార్త: నియోజకవర్గ పరిధిలోని ప్రతి సమస్యను తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేయడానికే వినూత్నంగా డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, చిత్తూరు రూరల్, గుడిపాల మండల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి వచ్చిన ప్రతి సమస్యను చిత్తశుద్ధితో పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు గురువారం నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల నుండి ప్రజలు 48 సమస్యలపై ఫిర్యాదులు చేశారు. వీటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే గత వారం నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చేపట్టిన చర్యలపై ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి ప్రజల నుండి సమస్యలపై 39 ఫిర్యాదులు అందితే ఈ సమస్యలను పరిష్కరించడానికి క్షేత్ర స్థాయికి వెళ్ళిన అధికారులు 23 సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించినట్లు సమావేశంలో ఎమ్మెల్యేకి వివరించారు. కార్యక్రమంలో మేయర్ అముద, కమీషనర్ డాక్టర్ జె.అరుణ, డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండల అధికారులు పాల్గొన్నారు.

**25 వేల మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ**

వినాయకచవితి పురస్కరించుకుని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల పరిధిలో 25 వేల మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీకి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.

## బూరగపల్లిలో లోపించిన పారిశుద్ధ్యం



చౌడేపల్లి, జూలై 18 ప్రభాతవార్త మండలంలోని ఆమినిగంట పంచాయతీ బూరగపల్లిలో పారిశుద్ధ్యం లోపించింది. వీధి కాలువల్లో మురుగునీరు నలచి అంటువ్యాధులకు నిలయాలుగా మారుతున్నాయి. సాయంత్రం అయితే దోమల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులంటున్నారు. ఇళ్ళ నుంచి విడుదల అయ్యే వ్యర్థపు నీరు కాలువల్లో పేరుకు పోయి దుర్గంధ పూరితంగా తయారువుతున్నా పట్టించుకొనే వారు కరువయ్యారని వాపోతున్నారు. గ్రామం వరకు మాత్రమే కాలువలను ఏర్పాటు చేసి చివర్లో లేక పోవడం వల్ల మురుగునీరు నిల్వ వుంటున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సి వుంది.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 252 వినతులు



కుప్పం, జూలై 18 ప్రభాతవార్త కుప్పం మండల కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 252 వినతిపత్రాలను ప్రజలు అధికారులకు అందజేశారు. ప్రధానంగా కుప్పం తహశీల్దార్ 90, శాంతిపురం తహశీల్దార్ 32, రామకుప్పం తహశీల్దార్ 30, గుడుపల్లె తహశీల్దార్ 21, పిడి డిఆర్‌డిఎ 23, ఆర్డీఓ కుప్పం 18 వినతులు రాగా మిగతావి వివిధ శాఖలకు సంబంధించి ఒకటి, రెండు అర్జీలు ప్రజలు అందజేశారు. కార్యక్రమాలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, కడ పి.డి. వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎమ్మెల్యే గారూ.. మాకు న్యాయం చేయండి

- కోట దుకాణదారుల వినతి



కోట, జూలై 18 ప్రభాతవార్త కోటలోని ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణదారులు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణదారులకు, ఆర్టీసీ అధికారులకు స్థలం ఎవరిది, ఎవరికి బాడుగలు చెల్లించాలనే నేపథ్యంలో ఆర్టీసీ దుకాణదారులకు,అధికారులకువివాదంతలెత్తడంతో దుకాణదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ క్రమంలో పంచాయతీ తరపున తాము న్యాయస్థానంలో నిలబడ్డామని ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు దుకాణదారుల అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయభాస్కర్ వివరించారు. తాము 30 సంవత్సరాలుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని పేర్కొన్నారు. తమకు న్యాయం చేసి జీవనోపాధికి భద్రత కల్పించాలని, చట్టప్రకారం ఆదుకోవాలని ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వీరి వెంట దాడి కృష్ణ, మస్తాన్‌రెడ్డి, జిలానిబాషా, శీనయ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ



చిల్లకూరు, జూలై 18, ప్రభాతవార్త చిల్లకూరు మండలంలోని పాలిచర్ల వారిపాలెం ప్రాద ్మిక పాఠశాలలో చదివే విద్యార్థులకు రాజానేని రామా నాయుడు చారిటబుల్ ట్రస్ట్ పౌండర్ రాజనేని శ్రీనివా సులు నాయుడు దాతృత్వంతో గురువారం నోటు పుస్త కాలు, విద్యా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సుధాకర్, సైదా కుమారి, చంద్రశేఖర్, రాజేంద్ర, మాధవయ్య, ట్రస్ట్ సభ్యులు బాబు తదితరులు పాల్గొన్నారు.

## స్టేడియంలో మౌళిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తా

గూడూరు, ఆర్డీవో కిరణ్ కుమార్

గూడూరు, జూలై 18, ప్రభాతవార్త కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అకౌంటు ద్వారా నిధులు సమీకరించి గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మౌళిక వసతులు ఏర్పాటు చేస్తామని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంను గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ పరిశీలించారు. గూడూరు ఆర్డిఓ కిరణ్ కుమార్ గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం పరిశీలించి స్థానిక క్రీడాకారులు, వాకర్స్ క్లబ్ సభ్యులతో చర్చించారు. స్టేడియంకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు, స్టేడియం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వారు ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆదేశాల మేరకు తాము స్టేడియంను పరిశీలించడం జరిగిందని ప్రధానంగా స్టేడియంకు డ్రైనేజీ ప్రాబ్లం ఉందని గుర్తించామని దానిని సరి చేస్తామని తెలిపారు.

## ప్రభుత్వ వసతిగృహాలను పరిశీలించిన అధికారులు



తడ, జూలై 18 ప్రభాతవార్త తడ మండలంలోని ప్రభుత్వ వసతి గృహాలను, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం మండల అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ అనుకూలమైన వాతావరణం ఉండాలని నిర్వాహకులకు తెలిపారు. సౌకర్యాలను మరింత మెరుగు పరచడానికి తమవంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కెజిబివి పాఠశాలలో ఎగ్జాట్ స్టాండ్స్ అవసరాన్ని గుర్తించి మండల పరిషత్ నిధులతో వాటిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపిడిఓ విజయకుమార్, ఎంఇఓ మల్లికార్జునరావు, తడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కిషోర్, తడకండ్రిగ పంచాయతీ కార్యదర్శి గాబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నిత్యావసర సరుకులు విక్రయించాలి

కోట, జూలై 18 ప్రభాతవార్త ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వ్యాపారులు నిత్యావసర సరుకులను విక్రయించాలని కోట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తహశీల్దార్ నాగరాజన్‌కు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు గురువారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టిక డిస్ప్లేను ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్ మాట్లాడుతూ వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఏ వస్తువునైనా విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, అనిల్, విఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## అదనపు బాధ్యతలతో ఎంపిడిఓగా నియామకం

తడ, జూలై 18 ప్రభాతవార్త తడ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలతో ఎన్.విజయకుమార్‌ను నియమించారు. ఇప్పటిదాకా ఇఓపిఆర్‌డిగా ఉన్న విజయకుమార్ ప్రస్తుతం ఇఓపిఆర్‌డిగాను, ఎంపిడిఓగాను పనిచేస్తారు.గురువారం ఆయనను పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సత్కరించి గౌరవించారు.

## వ్యవసాయ యంత్రసేవా కేంద్రాల తనిఖీ

తడ, జూలై 18 ప్రభాతవార్త తడ మండలం వేనాడు దీవిలోని ప్రభుత్వ యంత్ర సేవా కేంద్రాలను గురువారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. గత వ్యవసాయ సీజన్లలో మండలంలో మొత్తం 14 యంత్ర సేవా కేంద్రాలను మంజూరు చేశారు. వీటిలో వేనాడు దీవిలోనే రెండు కేంద్రాలు ఉన్నాయి. అప్పట్లో వీరికి వివిధ రకాల వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, రోటావేటర్లు, స్ప్రేయర్లు, కల్టివేటర్లు, గడ్డికట్టే మిషన్లు సబ్సిడీతో మంజూరు చేశారు. ప్రస్తుతం ఇవి ఆ రైతు కేంద్రాల వద్దనే ఉన్నాయా అనే దీనిపై ఈ వ్యవసాయ సీజన్‌కు ముందు పరిశీలించారు. సూళ్లూరుపేట ఎడిఎ జి.అనిత, తడ ఎంఎఓ ఎస్ఎన్ కాంచన, వివిఎ భారతి తదితరులు పాల్గొన్నారు. వేనాడు దీవిలోని సంధ్య, పొన్నియమ్మన్ కేంద్రాల కన్వీనర్లు ఎన్.అశోక్‌కుమార్, ఐ.శివయ్యలతో, రైతులతో మాట్లాడారు.

## హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

తడ, జూలై 18 ప్రభాతవార్త తడలో ఈ నెల 16వ తేదీన పట్టపగలు జరిగిన యువకుడిపై హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. తూర్పు గోదావరి జిల్లా తునికి చెందిన సతీష్‌కుమార్‌పై ఈ హత్యాయత్నం జరిగింది. ఈ కేసులో నిందితులు నీలపు రవీంద్రబాబు అలియాస్ రవీంద్ర అలియాస్ నానితో పాటు అల్లం దుర్గాప్రసాద్ అలియాస్ ప్రసాద్‌ను తడ పశువైద్యశాల వెనుక వీధిలో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులిద్దరు కాకినాడ పట్టణానికి చెందిన వారుగా పేర్కొన్నారు. తడ ఎస్ఐ పి.నరసింహారావు నిందితులను సూళ్లూరుపేట కోర్టుకు హాజరు పరిచారు. ఇదిలావుంటే వీరిద్దరూ దాడి చేసిన సతీష్‌కుమార్ ప్రస్తుతానికి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## తక్కువ ధరలకు నాణ్యమైన సరుకులు

తహశీల్దార్ పుల్లారావు

బాలాయపల్లి, జూలై 18, ప్రభాతవార్త తక్కువ ధరలకు నాణ్యమైన సరుకులను పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ పుల్లారావు తెలిపారు. మండల కేంద్రమైన బాలాయపల్లి రిటైల్ దుకాణం వద్ద రాయితీపై నాణ్యమైన సరుకులఅమ్మకంను తహశీల్దార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో కందిపప్పు ధర 200 ఉంటుందని బియ్యం 70 రూపాయిలు ఉంటుందని ప్రభుత్వం రాయితీతో కందిపప్పు 160 రూపాయిలకు నాణ్యమైన బియ్యం 49 రూపాయిలకే అందిస్తున్నట్లు తెలిపారు. దుకాణాదారుడు సుమన్ ఆర్ఐ పూర్ణచంద్రారావు, వీఆర్ఓలు కృష్ణయ్య, ఆదిశేషయ్య, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రైలు ఢీకొని మహిళ మృతి

తడ, జూలై 18 ప్రభాతవార్త తడ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారం దాటుతున్న ఒక గుర్తుతెలియని మహిళను రైలు ఢీకొనడంతో మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. గురువారం ఉదయం 5 గంటల సమయంలో తడ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారం నంబర్1 నుంచి 2వ ప్లాట్‌ఫారంకు వెళ్లడానికి పట్టాలు దాటుతుండగా హైదరాబాద్ నుంచి చెన్నైకి వెళ్లే హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ఆమె మృతిచెందింది. సుమారు 55 సంవత్సరాల వయస్సు ఉన్న ఈ మహిళ వివరాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. శవాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించామని, తమిళనాడుకు చెందిన మహిళగా భావిస్తున్నట్లు, ఆమె ఆచూకీ తెలిసిన వారు సూళ్లూరుపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

సూళ్లూరుపేట, జూలై 18 ప్రభాతవార్త సూళ్లూరుపేట మండలంలోని అటకానితిప్ప ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ శీనయ్య, పాఠశాల ఛైర్‌పర్సన్ కుయల్, ప్రధానోపాధ్యాయురాలు రేవతి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యేచే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



చిట్టమూరు, జూలై 18 ప్రభాతవార్త చిట్టమూరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అభివృద్ధి పనులకు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్‌చే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగనున్నాయి. ఈశ్వరవాక, బయ్యావారికండ్రిగ, అరవపాలెం గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో భాగంగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొం టారు. ఉదయం 10 గంటలకు ఈశ్వరవాక గ్రామంలో రైతు సేవా కేంద్రంతో పాటు సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. 11 గంటలకు అరవపాలెం పంచాయ తీ పరిధిలోని బయ్యావారికండ్రిగ, ఆలేటిపాడు తారురోడ్డు నిర్మాణానికి 5 కోట్ల 25 లక్షల అంచనాలతో శంకుస్థాపనచేయనున్నారు.చేయాలని మండల టిడిపి కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు పిలుపునిచ్చారు.

## అధికారులను బ్లాక్‌మెయిల్ చేయడం తగదు

- మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం



సూళ్లూరుపేట, జూలై 18 ప్రభాతవార్త పదేళ్లు ప్రజాప్రతినిధిగా పనిచేసి నియోజకవర్గంలో కీలకభూమిక వహించిన వ్యక్తి అధికారులను బ్లాక్‌మెయిల్ చేయడం తగదని మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకొని ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేసిన తహశీల్దార్‌ను బ్లాక్‌మెయిల్ చేసేందుకు ప్రయత్నించడం మంచిపద్ధతి కాదన్నారు. ప్రజల సౌకర్యార్థం కార్యాలయం ఆవరణలో గోడలు కట్టినందుకు ఆయనపై కొంతమంది అనుచరులను తీసుకొని మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య నిరసన తెలిపేందుకు వెళ్లడం మంచిది కాదని హితవు పలికారు. ఎంపిడిఓపై చర్యలు తీసుకోవాలనిసిఇఓకు, జిల్లా కలెక్టర్‌కు విన్నవించామని తెలిపారు.టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, మాధవనాయుడు, మేడా సాయినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల బదిలీలను ఆపాలని ఎంఈఓకి విజ్ఞప్తి

వెంకటగిరి, జూలై 18, ప్రభాతవార్త ధర్మాపురం ప్రాథమిక పాఠశాలలో ఉన్న నలుగురు ఉపాధ్యాయుల్లో ఇద్దర్ని బదిలీ చేశారని వారి బదిలీలను ఆపాలని ఎంఈఓ తోట వెంకటేశ్వర్లుకు స్థానికులు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని అందువల్ల విద్య బోధన కుంటుపడుతుందని వారి బదిలీని నిలిపివేయాలని కోరారు. నలుగురు ఉపాధ్యాయులు ఉండగా ఇద్దరినీ ఎంఈఓ వేరే చోటకు బదిలీ చేశాడని తెలిపారు. బదిలీ చేసిన వాడిని తిరిగి ధర్మపురం పాఠశాలకు రప్పిస్తానని ఎంఈఓ గ్రామస్తులకు తెలిపారు.

## మాజీ ఆర్టీసీ చైర్మన్ శంకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



వెంకటగిరి, జూలై 18, ప్రభాతవార్త నెల్లూరు రీజనల్ ఆర్టీసి మాజీ ఛైర్మన్ చెలికం శంకర్‌రెడ్డి మృతి వైసిపి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి టీచర్స్ కాలనీలో ఉన్న శంకర్ రెడ్డి భౌతికాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిలు కూడా శంకరరెడ్డి భౌతిక పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వెంకటగిరి, బాలాయపల్లి ఎంపిపిలు సౌజన్య రెడ్డి, భాస్కర్ రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతుశారద, మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వర రావు, టౌన్ క్లబ్ అధ్యక్షులు లక్కమనేని కోటేశ్వర రావు తదితరులు సంతాపం తెలిపారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు ప్రబలవు

సిడిపిఓ శంషాద్ బేగం



వెంకటగిరి, జూలై 18, ప్రభాతవార్త పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులు ప్రబలవని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. బంగారుపేటలోని అంగన్‌వాడి కేంద్రంలో డయేరియా నివాళులు పై ఆమె పిల్లలు తల్లిదండ్రులకుపలుసూచనలు,సలహాలుఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడుకోవాలని సూచించారు. చేతులు శుభ్రంగా కడుక్కుంటే పిల్లలకు వ్యాధులు రావని తెలిపారు. ఇంటి ఆవరణలో మురుగు కాలువలు గాని నీరు నిలవ లేకుండా చూసుకోవాలని తెలిపారు. బాల్య వివాహాలు చేస్తూ చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆమె వెంట అంగన్‌వాడి సిబ్బంది ఉన్నారు.

## గోశాల నిర్వహణ అభినందనీయం: ఎంఎల్ఏకు సత్కారం

శ్రీకాళహస్తిరూరల్, జూలై 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి పరిసరాల్లోని గోవులను గోశాలలో ఆదరించటం అభినందనీయం అని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం శ్రీకాళహస్తి పైప్స్ లో గోశాలను నిర్వహిస్తున్నారు. గోపూజ ఎంతో పుణ్యమంటారు. అలాంటి సంప్రదాయాన్ని నిర్వాహాకులు ఆచరించటం వారి లోనిధార్మికతకు,మూగజీవాల ఆదరణకు గుర్తింపు అన్నారు.ఎంఎల్ఏ గోవులకు ఆహా రాన్ని అందిం చారు

**సన్మానం:**

శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఎన్నికల్లో గెలిచిన తరువాత మొట్టమొదటి సారి శ్రీకాళహస్తి పైప్‌లైన్స్ పరిశ్రమ నిర్వాహాకుల ఆహ్వానం మేరకు వచ్చిన సుధీర్‌రెడ్డికి ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్ దుశ్శాలువతో సత్కరించారు.

## వాహనదారులు హెల్మెట్ ధరించండి..ప్రాణాలు కాపాడుకోండి

-అదనపు జిల్లా జడ్జి



తొట్టంబేడు, జూలై 18 ప్రభాతవార్త

ప్రతి వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించి ద్విచక్రవాహనాలు నడపాలని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ పిలుపునిచ్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం శ్రీకాళహస్తి కోర్టు ఆవరణ నుంచి పెండ్లి మండపం వరకు శివస్త్రానం తప్పక వాడాలని కోరుతూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ మరియు సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణిలు ప్రారంభించారు. ఈసందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ హెల్మెట్‌లేని ప్రయాణం ప్రమాదకరమని ప్రస్తుత పరిస్థితుల్లో హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది హెల్మెట్‌లేకుండా మృతిచెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వాహనదారుడు తమ కుటుంబాన్ని గుర్తించుకుని ప్రయాణం సాగించాలన్నారు. న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రారంభం

.తొట్టంబేడు, జూలై 18 ప్రభాతవార్త

జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ ప్రారంభించిన క్రియశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోట ప్రారంభించారు. నియోజకవర్గ సభ్యత్వ నమోదు వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరు జూలై 18 నుంచి 28 వరకు బాధ్యతగా తీసుకుని కష్టపడి పనిచేయాలని సూచించారు. కష్టపడి ప్రతి ఒక్క కార్యకర్తకి పార్టీ అధిష్టానం వద్ద నేరుగా గుర్తింపు వచ్చే కార్యక్రమంను క్షేత్రస్థాయి కార్యకర్తలు ఉపయోగించుకోవాలన్నారు. పార్టీ అధికారంలో ఉండడంతో ఉత్సాహంగా పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదుచేసి జిల్లాలోనే అధిక సభ్యత్వాలు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమం అనంతరం నాయకులు, జనసైనికులు, వీరమహిళలు సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా వినుత కోట మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి సారిగా రాజకీయ పార్టీ కార్యకర్తల సంక్షేమం ఆలోచించి ప్రమాదబీమా రూ.5భీమా 50వేలు అందిస్తున్నది జనసేన పార్టీ పవన్‌కళ్యాణ్ అని తెలిపారు. కార్యక్రమంలో వాలంటీర్లు సభ్యులు, మండల అధ్యక్షులు, నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

శ్రీకాళహస్తి, జూలై 18 ప్రభాతవార్త



పట్టణంలో డొక్కాసీతమ్మ స్ఫూర్తితో ప్రతి వారం జనసేన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోట ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కాసీతమ్మ స్ఫూర్తితో స్థానిక ఆర్టీసి బస్టాండు వద్ద జనసేన వీరమహిళలు ఆధ్వర్యంలో గాయత్రి, శార ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిం చారు. డొక్కాసీ తమ్మ అన్నదాన శిబిరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోట చేతులమీదుగా ప్రారంభించి సుమారు 250మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

## బోధనాభ్యసనలో నూతన ఒరవడికి శ్రీకారం

శ్రీకాళహస్తి, జూలై 18 ప్రభాతవార్త




శ్రీకాళహస్తిలో బోధన అభ్యసనలో నూతన ఒరవడికి ప్రభుత్వం అవసరమైన చర్యలుతీసుకుంటున్నట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు అపర్ణ అన్నారు. శ్రీకాళహస్తి ఆర్‌పిబిఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సిఆర్పీలకు టీచ్ టూల్‌పై తొమ్మిదిరోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అపర్ణ మాట్లాడుతూ విద్యార్థి అన్ని విభాగాల్లో తగిన జ్ఞానాన్ని సాధించేలా ఉపాధ్యాయయులు బోధన కొనసాగించాలని సూచించారు. ఈ ప్రధానోపాధ్యాయులు, సిఆర్పీలు తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధనను మదింపు చేసే విధానంపై శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు హజరైన ఉపాధ్యాయులు శ్రద్దగాద శిక్షణను పూర్తిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ఆర్పీలు సుబ్రమణ్యం, వెంకటరమణయ్య, ప్రసాద్, పవన్, విజయకుమార్, శ్రీకాళహస్తి, వరదయ్యపాళెం, తొట్టంబేడు, కెవిబిపురం, బిఎన్‌కండ్రిగ, వెంకటగిరి, డెక్కలి, బాలాయపల్లి, పెళ్ళకూరు మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్పీలు పాల్గొన్నారు.

## విద్యార్థిని అదృశ్యం

శ్రీకాళహస్తిరూరల్, జూలై 18 ప్రభాతవార్త.

మండలంలోని అక్కుర్తి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి(17) కనిపించడం లేదని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు రూప, వెంకటేష్‌లు గురువారం పిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ పరమేశ్వరనాయక్ మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## 21న ఐఐటి 6వ కాన్వకేషన్

శ్రీకాళహస్తి,జూలై 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడులో నిర్వహిస్తున్న తిరుపతి ఐఐటి 6వ వార్షికోత్సవాన్ని ఈ నెల 21న నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నామని డైరెక్టర్ సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమౌతాయని తెలిపారు. చైర్మెన్ సజ్జాన్ జిందాల్ అధ్యక్షతన జరిగే కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఇన్‌పోసిస్ కో ఫౌండర్ క్రిస్ గోపాల కృష్ణన్ హాజరౌతారని వివరించారు. విద్యార్థులకు దిశ దెశ నిర్దేశం చేస్తారని వివరించారు.

## పండగ వాతావరణంలో జనసేన సభ్యత్వాల నమోదు

కుప్పంరూరల్, జూలై 18 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదును పండగ వాతావరణంలో చేపడుతున్నట్లు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త డా॥ నరేష్ పేర్కొన్నారు. బుధవారం కుప్పంలోని పార్టీ కార్యాలయంలో నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా డా॥ నరేష్ తన సభ్యత్వంతో కార్యక్రమంను మొదలుపెట్టారు. పది రోజుల పాటు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడ్తామని ఆయన తెలిపారు. 18-60 ఏళ్లలోపు వయసు గలవారు క్రియాశీలక సభ్యత్వం పొందితే వారికి ఐదు లక్షల భీమా సౌకర్యం పార్టీ కల్పిస్తుందన్నారు. గతంలో సభ్యత్వాలు ఉన్నవారు రెన్యువల్ చేయించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో కూటమి నాయకులు మరియు పార్టీ అధిష్టానం ఆదేశాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదుకు యాభైమంది వాలంటీర్లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు, వీర మహిళలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్
- చందంలో ప్రభుత్వ పాఠశాల పున: ప్రారంభం !!

కుప్పంరూరల్, జూలై 18 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో సిఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల చొరవతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చందం ఎస్సీ కాలనీలో ప్రభుత్వ పాఠశాలను పున:ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం ప్రాంతాన్ని విద్యా కేంద్రంగా మార్చేందుకు సిఎం చంద్రబాబు చొరవ చూపుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ముున్ముందు ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని, విద్యకు తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో తెదేపా పతాకావిష్కరణ చేశారు.కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం,మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, కన్నన్, వసంతమ్మ, ఎంఇఒ మహబూబ్ బాషా, సిఆర్‌పి నాగార్జున, స్థానిక

## అంచెలంచెలుగా చంద్రగిరి అభివృద్ధికి చర్యలు

మండల మీట్‌లో ఎంఎల్ఏ పులివర్తి నాని



చంద్రగిరి, జూలై 18 ప్రభాతవార్త:

చారిత్రాత్మక చంద్రగిరిలో అభివృద్ధి పనులకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా కలసి పనిచేద్దామంటూ ప్రతిపక్ష వైసిపి ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. పాతికేళ్ళుగా జరగని అభివృద్ధిని మనమంతా ఒక్కతాటిపై నిలిచి సాదిద్దామంటూ హితవు పలికారు. నాగాలమ్మ సర్కిల్ నుండి శ్రీనివాస మంగాపురం, తొండవాడ రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరూ కలసి రావాలని కోరారు. సమావేశంలో ప్రతిపక్ష ఎంపిపి, జడ్పీటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు లేవనెత్తిన ప్రతి సమస్య పట్ల ఎంఎల్ఏ సానుకూలంగా స్పందిస్తూ ఔరా అనిపించుకున్నారు. ఎక్కడా భేషజాలకు వెళ్ళకుండా మీ ప్రోటోకాల్‌కు భంగం కలగనీయకుండా చూస్తామనీ, అందరం కలసి చంద్రగిరి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రస్తుతం చంద్రగిరి ముద్దుబిడ్డ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వున్నారనీ, అదేవిధంగా నారా లోకేష్ మంత్రిగా వున్నారన్నారు. మన సమస్యల పరిష్కారంలో వీరి సహకారాన్ని మనం అందిపుచ్చుకోవాల్సి వుందన్నారు. ఈ సమావేశంలో ఆయా విభాగాల వారీగా తమ పురోగతిని వివరిస్తూ తమ ఇబ్బందులను ఎంఎల్ఏ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి తగిన సూచనలు చేశారు. వసతి గృహాల పరిసరాలలో సిసి కెమెరాల పర్యవేక్షణ వుండాలని సంబంధిత అధికారులకు సూచించారు. చంద్రగిరిలో శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, టిడిపి వ్యవస్థాపకులు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాల ప్రతిష్టకు కట్టుబమడివున్నట్లు సభ్యుల ప్రశ్నకు స్పందించారు. ఈ క్రమంలో తమ ఆరాధ్యుడైన శ్రీకృష్ణదేవరాయలు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుపై టిడిపి నాయకుడు మునిరత్నం రాయల్ కోరడంతో విగ్రహాన్ని వితరణ చేయాలని ఎంఎల్ఏ కోరడంతో అంగీకరించారు. ప్రాధాన్యతా క్రమంలో పనుల పురోభివృద్ధికి శ్రీకారంచుడుతున్నట్లు ఎంఎల్ఏ వెళ్ళడించారు.

## నాటకోత్సవాలను దిగ్విజయవంతం చేయండి

అభినయ ఆర్ట్స్ సారథులు పిలుపు

తిరుపతి హెల్త్, జూలై 18, ప్రభాతవార్త



టిడిపి మహతి ఆడిటోరియంలో ప్రతి ఏడాదిలాగే ఈ 24వ జాతీయ స్థాయి హానుమ అవార్డ్స్ నాటకోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అభినయ్ ఆర్ట్స్ అధినేత బిఎన్ రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో గురువారం మీడియాలో అభినయ ఆర్ట్స్ రధసారథులు అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి, అధ్యక్షులు మబ్బు సూర్యనారాయణ రెడ్డి, మిమిక్రీ విజయ్ కుమార్, ఇరమునిశేఖర్ తదితరులతో కలిసి బిఎన్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 20 నుండి 28న తేదీ వరకు ప్రతి రోజు పద్య నాటకములు, సాంఘిక నాటికలు, కూచిపూడి, భరతనాట్య, జానపద, సోలో నృత్య పోటీలు ఉంటాయని వీరిలో బెస్ట్ పర్పామెన్స్ కింద చివరి రోజు హనుమ అవార్డ్స్ వీరిలో బెస్ట్ పర్పామెన్స్ కింద చివరి రోజు హనుమ అవార్డ్స్ అందజేయడం జరుగుతుం దన్నారు.

## అపోలో డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

తిరుపతి హెల్త్, జూలై 18, ప్రభాతవార్త



ఆధునిక ప్రాసెసింగ్ ల్యాబ్ అపోలో డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను తిరుపతిలోని ఎన్జీవో కాలనీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ప్రతాప్ రెడ్డి విదేశాల్లో వైద్యం చేస్తున్న సమయంలో అత్యున్నత వైద్య సేవలు భారత్‌లో అందజేయాలని ఆకాంక్షించారన్నారు. అపోలో ఆసుపత్రులు ఈ రోజు దేశ, విదేశాలలో అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు అందజేస్తుందని చెప్పారు. తిరుపతిలో అపోలో డయాగ్నోస్టిక్స్‌ను ఏర్పాటు చేయడం సంతోషం అన్నారు. ఇది సరికొత్త సాంకేతికతతో సమగ్ర రోగ నిర్ధారణ సేవలను అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అపోలో హెల్త్ లైఫ్ స్టైల్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీరామ్ అయ్యర్ మాట్లాడుతూ అపోలో డయాగ్నోస్టిక్స్ అపోలో హెల్త్ అండ్ లైఫ్ స్టైల్ లిమిటెడ్ యూనిట్ ఐఎస్ఓ సర్టిఫికేషన్‌తో కూడిన పాథాలజీ ల్యాబ్ ఇదన్నారు. ఇది 140వ ప్రాసెసింగ్ ల్యాబ్ అన్నారు. తిరుపతిలో ఆరు పేషెంట్ కేర్ సెంటర్లు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 115 సెంటర్లు కలవన్నారు. ఈ ల్యాబ్ నెలకు ఇరవై ఐదు వేల నమూనాల ప్రాసెసింగ్ సామర్థ్యంతో విస్తృత స్పెక్ట్రమ్ పరీక్షలను అందించనుందని తెలిపారు. తిరుపతిలో ఉన్న వారు ఇప్పుడు అపోలో డయాగ్నోస్టిక్స్ విస్తృతమైన పరీక్షలకు యాక్సెస్‌ను కలిగి ఉంటారన్నారు. మూడు వేల పరీక్షలు, నిపుణుల హెల్త్ చెకప్ ప్యాకేజీలు ఉన్నాయని చెప్పారు. అపోలో డయాగ్నోస్టిక్స్ దేశ వ్యాప్తంగా 2000 పైగా సేకరణ కేంద్రాలతో 135 పైగా ల్యాబ్‌లను కలిగి ఉందన్నారు. గ్లోబల్ రిఫరెన్స్ ల్యాబ్ సిఏపీ గుర్తింపు పొందింది. హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం కలదన్నారు. మరిన్ని సమాచారానికి 9963980259, 9985310069ను సంప్రదించాలన్నారు.

## మొక్కులు చెల్లించుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే నాని

తిరుమల,జూలై 18ప్రభాతవార్తప్రతినిధి:



సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల నాయకుడుగా గెలవాలని, ప్రజలకు మరిన్ని మంచిపనులు చేసే శక్తిని ఇవ్వాలని కోరుతూ శ్రీవారికి మొక్కుకున్న మొక్కులు గురువారం ఉదయం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని కుటుంబంతో కలసి తీర్చుకున్నారు. తన తలనీలాలు సమర్పించి గురువారం ఉదయం కుటుంబంతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా నాని తిరుమలేశుని దర్శించుకుని అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.




## వీకెండ్ వినోదంలో

జీ తెలుగులో డీడీ రిటర్న్స్, గామి

తిరుపతిటౌన్,జూలై 18ప్రభాతవార్త:

తెలుగుప్రేక్షకులకు వీకెండ్ వినోదంలో జీ తెలుగులో శనివారం డీడీ రిటర్న్స్, ఆదివారం గామి వీనులవినోదం కలిగించనున్నాయని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. ఆదరణ ఉన్న రెండు జీ తెలుగు, జీ సినిమాలులో వారం వారం సరికొత్త సినిమాలతో తెలుగుప్రేక్షకులకు ఎనలేని వినోదం పంచుతున్నాయన్నారు. 20వతేదీ శని వారం సాయంత్రం 6గంటలకు జీ సినిమాలో డీడీ రిటర్న్స్, 21వతేదీ ఆదివారం సాయంత్రం 6గంటలకు గామి ప్రీమియర్ ప్రసారం కానున్నాయన్నారు. ప్రేక్షకులకు మరచిపోలేని అనుభూతి కలిగిస్తుందన్నారు.

## నూతన కార్యవర్గానికి రంగస్థలి శుభాకాంక్షలు

తిరుపతిటౌన్, జూలై 18ప్రభాతవార్త:



గోవిందదామం నూతన కమిటీని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి సన్మానించారు.ఈ కమిటీలో ఎస్వీఎంవెంకటేశ్ ఉండటంతో ఆయనను దుశ్శాలువతో సత్కరించి, సేవలు విస్తృతం చేయాలన్నారు.

## స్థానిక యువతకు ఉపాధి కల్పించండి: అభివృద్ధికి సహాకరిస్తా!




బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తిరూరల్,జూలై 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మొట్టమొదటి పరిశ్రమ లాంకో కు తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సహాకరించారని అంతేకాక తన పెదనాన్న పొలాలను ఇప్పించి నిరుద్యోగులకు, యువతకు ఉపాధి కల్పనకు సహాకరించారని అదే సహాకారం తాను ఇస్తానని అయితే స్థానిక యువతకు ఉపాధి కల్పనకు పరిశ్రమ సహాకరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కోరారు. శ్రీకాళహస్తి పైప్ లైన్స్,ఎలక్ట్రో స్టీల్ క్యాసింగ్ కంపెనీని సందర్శించిన శాసనసభ్యుడు పలు అంశాలకు సంబంధించి చర్చించారు.ఈ సందర్భంగా సిఇఓ కండేల్ వాల్ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో పైప్స్ కంపెనీకి దేశ వ్యాప్తంగా 12 శాఖలున్నాయని అయితే గత ప్రభుత్వ హయాంలో కొన్ని సమస్య వచ్చాయని వాటిని పరిష్కరించు కున్నామన్నారు.కలకత్తా కేంద్రంగా మా ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా మన్ననలందుకుంటుందని వివరించారు. ఈ సమావేశంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ పరిశ్రమల స్థాపనకు గతంలో తన తండ్రి ఎంతో కృషి చేశారని అలాగే తాను కూడా సహాకరిస్తామన్నారు.ఇక్కడ ఆరువేల మందికి ఉపాధి కల్పించుటకు పరిశ్రమను స్థాపించారు.అయితే ఆ సంఖ్య 20వేలకు పెంచాలన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం అభివృద్ధికి పరిశ్రమ సహాకరించాలన్నారు.కార్మికులు కూడా ఘర్షణ వాతావరణం వద్దు పరిశ్రమ మనకు తల్లిలాంటిది.కాబట్టి సమస్య వస్తే కూర్చొందాం మాట్లాడుకుందాం.జి.విజయకుమార్,చెంచయ్యనాయుడు, వెంకటసుబ్బారెడ్డి, జగదీశ్వ రరెడ్డి, బత్తిరెడ్డి,పేరం నాగరాజునాయుడు,కన్నలి ప్రతాప్, కంపెనీ తరఫున రాజీవ్ ప్రకాష్, దొరైరాజు పాల్గొన్నారు.

## సప్పరంలో దర్శనమిచ్చిన ద్రౌపదీ దేవి

శ్రీకాళహస్తి,జూలై 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్జునుడు, శ్రీకృష్ణుడు, ద్రౌపదీ అమ్మవారు పట్టణ ప్రజలకు దర్శనమిచ్చారు. రాత్రి ఉత్సవంలో ద్రౌపదీ అమ్మవారిని కురులు విరబోసుకొని అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. మహాభారత పఠనంలోని ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టాన్ని పఠించారు. ఉదయం పట్టణంలోని ఊరేగింపు నిర్వహించిన తరువాత భారత పఠనం నిర్వహించారు.ఉభయదారులు జూలుగంటి హరినాథ్‌బాబు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు జూలుగంటి గోపి, గాజుల సుదర్శనం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డాక్టర్ సాయిప్రసాద్,సంధ్యల కుటుంబసభ్యులు హాజరు కాగా కార్యక్రమాల్ని నిర్వహించారు. రాత్రి ఆలయంలో వస్త్రాపహరణ అనంతరం అమ్మవారిని పట్టణంలో ఊరేగింపుకు ఆలయ పూజారులు రఘు, పురుషోత్తంలు పూజలు నిర్వహించారు.ఊరేగింపు మద్రాస్‌రోడ్డు, జయరామారావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల గుండా సాగింది.ఉత్సవాలను వెంకటస్వామి, దుర్గా ప్రసాద్‌లు పర్యవేక్షిస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## అడ్వాన్స్ లీడర్షిప్ క్యాంపును పూర్తి చేసిన ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి

తిరుపతి విద్య, జులై 18, ప్రభాతవార్త



శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల ఎయిర్ వింగ్ విద్యార్థులు ఒడిస్సాలో అడ్వాన్స్ లీడర్షిప్ క్యాంప్ 2024ను తిరుపతిలో మాన్యువల్ ట్రైనింగ్ క్యాంపను పూర్తి చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సత్య నారాయణ తెలిపారు. ఒడిస్సా డైరెక్టరేట్ వారు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి అడ్వాన్స్ లీడర్షిప్ క్యాంప్ 2024 జులై నెల రెండవ తేది నుండి 13వ తేది వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ తరపున తిరుపతిలోని ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల నుండి బిఎస్సి బయోటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దితీస్ లూయి పాల్గొన్నారు. అలాగే 11 ఏ ఎయిర్ ఎస్క్యాఎన్ టెక్నికలల్ ఎన్సిసి తిరుపతి వారు జులై నెల మూడో తేది నుండి 12 వరకు నిర్వహించిన మ్యానువల్ ట్రైనింగ్ క్యాంపును ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాల ఫ్లైట్ లెఫ్టినెంట్ పి ఉదయ్ సంరక్షణలో 24 మంది విద్యార్థులు పాల్గొని క్యాంపును పూర్తి చేశారు. ఈ విద్యార్థులందరికీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డి. పరమేశ్వర, ఎయిర్ వింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ పి. ఉదయ్ విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేసి అభినందించారు.

## సమాజంలో మార్పు కోసం పార్టీ సభ్యత్వం తీసుకోండి

- జనసేన ఇన్‌చార్జి మహేష్

నగరి, జూలై 18 ప్రభాతవార్త:



నగరి నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమం ప్రారంభించారు. సమాజంలో మార్పు బడుగు బలహీన వర్గాల్లో ప్రజల జీవితంలో వెలుగు రావాలంటే పవన్‌కల్యాణ్ స్థాపించిన జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యత్వం తీసుకోవాలని జనసేన పార్టీ ఇన్‌చార్జి మెరుపుల మహేష్ తెలిపారు. అనంతరం జనసేన పార్టీ సభ్యత్వం వివరాల కోసం నగరి కేంద్ర కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## ఓంశక్తి ఆలయంలో కుట్టు మిషన్ల పంపిణీ

నగరి, జూలై 18 ప్రభాతవార్త:



నగరి పట్టణంలో వెలసి ఉన్న ఓం శక్తి ఆలయంలో మందిర వార్షికోత్సవ సందర్భంగా పేద బలహీన వర్గాల వారికి కుట్టు మిషన్లు, టిఫిన్ పాత్రలు, చీరలు పంపిణీ చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అనంతరం 1008 కుంకుమార్చన 1008 పుష్పార్చనలు, 136 మహిళా భక్తులచే పెద్ద ఎత్తున వైభవంగా పూజలు నిర్వహించారు. ఆలయంలో తిరుమలకు వెళ్లే గోవింద భక్తులకు, నగరి పరిసర ప్రాంత భక్తులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, చిత్తూరు జిల్లా ఆదిపరాశక్తి ప్రచార కమిటీ అధ్యక్షులు గంగాధరం, వాసు, అసిస్టెంట్ డైరెక్టర్ నరేష్‌బాబు, నగరి మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సూర్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జయరామరాజు, ఓంశక్తి ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, సేవకులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి

నగరి, జూలై 18 ప్రభాతవార్త:



మండలంలోని వెంకట నరసింహరాజు వారి పేట నగరి రైల్వేస్టేషన్ మధ్య 92/3-5 పోస్టులవద్ద ఎగువ రైలు మార్గంలో సుమారు 65 సంవత్సరాల వయసు కలిగిన వృద్ధుడు గురువారం ఉదయం 5.30 గంటలకు రైలు బండి కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. క్రైమ్ నెంబరు 86/2004 అండర్ సెక్షన్ 1944 బీఎన్ఎస్ఎస్ మేరకు ఆత్మహత్య కేసుగా నమోదు చేశామన్నారు. వృద్ధుడు సిమెంటు కలర్, ఆఫ్ టీషర్టు, బ్లూ కలర్ చెక్ లుంగీ ధరించి ఉన్నారన్నారు. వివరాలు తెలిసిన వారు 9963026343, 9440627649 నెంబర్లకు సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## అక్రమ కట్టడాలపై చర్యలు తప్పవు - ఎమ్మెల్యే

రేణిగుంట, జూలై 18 ప్రభాతవార్త:



రేణిగుంట పరిధిలోని సమస్యలన్నిటిని అతి త్వరలో పరిష్కరిస్తారని, పంచాయతీ స్థలాలు ఆక్రమించి కట్టిన కట్టడాలపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేని గురువారం రేణిగుంట మాజీ సర్పంచ్‌లు జ్యోతినారాయణ, శివకుమార్, ముస్లిం మైనారిటీ నేత జీకే మునీర్, టీడీపీ యువ నేత వార్డు మెంబరు ఎంజీ రెడ్డి తదితరులు కలసి శాలువలు కప్పి ఘనంగా సత్కరించిన అనంతరం రేణిగుంట పంచాయతీ సమస్యలను తెలియజేశారు. పంచాయతీ స్థలాలు ఆక్రమణలు, నీటి సమస్య, రోడ్ల దుస్థితి, తదితర అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేసి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. కొద్ది రోజుల్లో రేణిగుంట పంచాయతీలో పర్యటించి ఆక్రమణలను, సమస్యలను తెలుసుకుంటానన్నారు. నిజ నిర్ధారణ జరిపి వాస్తవ అవాస్తవాలను పరిశీలిస్తామన్నారు. పంచాయతీకి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యేకి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో అమరనాథ్‌రెడ్డి, సాగర్, నరసింహులు, కిషోర్ తదితరులు ఉన్నారు.

## రైల్వేల కోసం ప్రధాన మంత్రి నిర్ణయాలు అన్నిర్వచనీయం



- బీజేపీ నేతలు

రేణిగుంట, జూలై 18 ప్రభాతవార్త:

భారత ప్రధాని మోదీ ప్రజల సౌకర్యార్థం రైల్వే శాఖలో తీసుకుంటున్న నిర్ణయాలు అన్నిర్వచనీయమని బీజేపీ నేతలు అన్నారు. రేణిగుంట రైల్వేస్టేషన్ వీఐపీ లాంచ్‌లో గురువారం స్టేషన్ మాస్టర్ శివప్రసాద్ అధ్యక్షతన కన్సల్టేటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు, కమిటీ సభ్యులు స్టేషన్ మేనేజర్ ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత ప్రధాని మోదీ భారతీయ రైల్వేలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారన్నారు. ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. మేకిన్ ఇండియాలో వందే భారత్ రైళ్ళను ప్రవేశపెట్టి తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుస్తున్నారన్నారు. సమావేశంలో కమిటీ కో-ఆర్డినేటర్ మేళంగారి సుబ్రహ్మణ్యంరెడ్డి, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, బీజేపీ నేతలు, రైల్వే అధికారులు నరేష్, శ్రీహరి, నాగేశ్వరరావు, పూజారి ప్రేమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తామరగుంటను అభివృద్ధి చేయండి

వడమాలపేట, జూలై 18 ప్రభాతవార్త:



శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వెలసిన వడమాలపేట మండలం అప్పలాయగుంటలో ఉన్న తామరగుంటను టీటీడీ ద్వారా అభివృద్ధి చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గురువారం తిరుపతిలో మంత్రిని కలసిన భానుప్రకాష్ టీటీడీ అనుబంధ దేవాలయం అయిన అప్పలాయగుంట దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతున్నదని నిత్యం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని వివరించారు. ఆలయానికి ఎదురుగా ఉన్న తామరగుంటలో గతంలో స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించేవారని నేడు అది పాడు పడిపోయిందని వివరించారు. తామరగుంటను అభివృద్ధి చేసి ఫ్లోట్ ఫెస్టివల్, కార్తీక దీపోత్సవంకు ఉపయోగించుకునేట్లు చూడాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని భానుప్రకాష్ తెలిపారు.

## కళియంబాకంలో వైభవంగా గంగమ్మ ఊరేగింపు

విజయపురం, జూలై 18 ప్రభాతవార్త:



మండలంలోని కళియంబాకంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గంగమ్మజాతర గురువారం ముగిసింది. గంగమ్మకు పూజలు నిర్వహించి మేళతాళాలతో ఊరేగించారు. గ్రామంలో భక్తులు గంగమ్మకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో యువత మ్యూజికల్ డాన్స్‌తో కోలాహలంగా కొనియాడారు.

## దుస్థితిలో ఆలపాకకండ్రిగ, జీఎం పురం రోడ్డు

విజయపురం, జూలై 18 ప్రభాతవార్త:



మండలంలోని ఆలపాకం కండ్రిగ-జీఎం పురం రోడ్డు దుస్థితిలో చేరుకుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఆలపాక కండ్రిగ, బూచివానత్తం వద్ద రోడ్డు దుస్థితికి చేరుకోవడంతో ద్విచక్రవాహనాలు వెళ్ళడానికి కూడా ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. తేలికపాటి చినుకు పడితే రోడ్డు కనిపించకుండా పోతుందని, అధికారులు, పాలకులు రోడ్డును మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నేడు అర్జున తపస్సు... కదలి రానున్న భక్త జనం

శ్రీకాళహస్తి, జూలై 18 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది తరలివచ్చి తరించే ఉత్సవాల సందర్భంగా అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ఇఓ మూర్తి, శాసన సభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డికి ఇది మొదటి ఉత్సవం. కాబట్టి వైభవంగా భక్తులు, పట్టణ ప్రజలు నచ్చే విధంగా నిర్వహించుటకు సన్నాహాలు చేపట్టారు. ప్రతి ఏడాది అధికారులు ప్రణాళికా బద్ధంగా నిర్వహించటం ఆనవాయితి. ఈ ఏడాది రాజకీయం, దేవాదాయశాఖ,పోలీసు శాఖలో కొత్త అధికారులు వచ్చారు. ఓ వైపు ఆలయం మరో వైపు పోలీసు అధికారి, ఇంకొక వైపు మున్సి పాలిటి భక్తులకు సౌకర్యాల కల్పనలో తలమునకలై ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆలయం ఎదురుగా 'అర్జున తపస్సు కార్యక్రమాల్ని' నిర్వహించనున్నారు. ఈ ఉత్సవానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు పట్టణ నలుమూలల్లోని భక్తులు వేలాది మంది తరలి వస్తారు. వచ్చిన భక్తులకు ఆహ్లాదం కల్పించుటకు ఇప్పటికే ఎన్నో వినోద కార్యక్రమాలు


అర్జున తపస్సు దృశ్యం(ఫైల్ ఫోటో)

నిర్వహిస్తున్నారు. ఆలయం చట్టు ఏర్పాట్లు చేశారు. ఇక శ్రీకాళహస్తీశ్వ రాలయం అధికారులు ఇప్పటికే బారికాడ్లు నిర్మాణంలో తలమునకలై ఉన్నారు.అంతేకాక భక్తుల తోసులాట తొక్కిసలాట చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేపట్టాలని ఇఓ తన సిబ్బందికి సూచించారు. ఇక్కడ ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డికి సూచించారు.ఈ నేపధ్యంలో ఇంజనీరింగ్ విభాగం ఇక్కడ తిష్టవేసి ఏర్పాట్లు చేపట్టారు.పురాతన కాలం నుంచి ఇక్కడి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో చివరి మూడు రోజులు భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించటం ఆనవాయితి. ఆ రోజు నుంచే అగ్నిగుండ ప్రవేశం చేసే భక్తులు కంకణ ధారణ గావించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో ఏర్పాట్లు సమీక్షిస్తున్నారు.

**భారీ బందో బస్తుకు ప్రణాళిక:**

సాధారణంగా మహాశివరాత్రి, ధర్మరాజుల తిరునాళ్ళుకు బయటి ప్రాంతాల నుంచి కూడా పోలీసుల్ని బందోబస్తుకు సన్నాహాలు చేస్తున్నారు.. ప్రస్తుత డివైయస్‌పి ఉమా మహేశ్వ రరెడ్డి, సిఐలు నరసింహారావు, రారాజు సిఐలు బయటి పోలీసుల్ని రప్పించ కుండానే ప్రణాళిక బద్దంగా చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజూ ఆలయం వద్ద ఆయనే సమీక్షించు కుంటున్నారు. ఇక మున్సి పాలిటి మంచినీటి సరఫరా, శానిటేషన్స్‌కు సంబంధించి పరిశీలిస్తున్నారు.

## కుప్పాన్ని విద్యా కేంద్రంగా మార్చేందుకు చర్యలు : కలెక్టర్



కుప్పం, జూలై 18 ప్రభాతవార్త : కుప్పాన్ని విద్యా కేంద్రంగా మార్చేందుకు తగు చర్యలు తీసుకుం టున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను జిల్లా కలెక్టర్ చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ శ్రీనివా సులు, కడ పి.డి. వికాస్ మర్మత్ తదితరులు ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడారు. కుప్పంలో కేంద్రీయ విద్యాలయం స్థాపనకు, కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు అవసరమైన భూములను పరిశీలించడం జరుగుతోందన్నారు. కుప్పం నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానికంగానే ప్రజా వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గృహ నిర్మాణం, సామాజిక పెన్షను , మౌలిక వసతులు, రెవెన్యూ తదితరాలకు సంబంధించి ప్రజలు వినతులు అందిస్తున్నారన్నారు. ప్రజలనుంచి వచ్చే వినతులను పదిహేను రోజుల్లోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారంలో పురోగతిని తాను, జాయింట్ కలెక్టర్ సమీక్షించడం జరుగుతుందన్నారు. మండల, డివిజన్ స్థాయి సమస్యలను ఆయా స్థాయిల్లోనే పరిష్కరిస్తారని, పరిష్కారం కానివి జిల్లా స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ప్రతి పదిహేను రోజులకు ఓ సారి కుప్పంలో పర్యటించి సమస్యలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. రానున్న ఆర్నెల్లకాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డ్వామా పిడి రాజశేఖర్, డిఆర్‌డిఎ, హౌసింగ్ పిడిలు తులసి, పద్మనాభం, తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఓ ఖాదర్ బాషా, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థినిపై అత్యాచారం పాల్పడ్డ రౌడీ షీటర్!

**-వినయ్ పై చట్టపరమైన చర్యలు చేపడతాం-గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి**



గూడూరు, జూలై 18 ప్రభాతవార్త : ఇంటర్మీడియట్ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన రౌడీ షీటర్ వినయ్‌పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గూడరు డిఎస్‌పి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. గురువారం గూడూరు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. గురువారం గూడూరు రెండవ పట్టణానికి చెందిన బాధితురాలు విద్యార్థిని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతుందన్నారు. అయితే గూడూరు ఒకటో పట్టణానికి చెందిన రౌడీషీటర్ వినయ్ ఆ విద్యార్థిని గత మూడు సంవత్సరాలుగా వేధిస్తున్నాడన్నారు. ఈ క్రమంలో రెండు సంవత్సరాల క్రితం అతనికి ఆ విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసుల ద్వారా వార్నింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. అకస్మాత్తుగా బుధవారం ఆటో తీసుకొని వచ్చి ఆ విద్యార్థినిని కత్తితో బెదిరించి ఆటోలో ఎక్కించుకొని గూడూరు రెండో పట్టణ పరిధిలోని గాంధీ నగర్ ప్రాంతంలో నిర్జీవ ప్రాంతంలో అత్యాచారానికి ఒడిగట్టాడు అన్నారు. దీంతో అవమానభారంతో ఆ విద్యార్థిని ఇంటిలో అందుబాటులో ఉన్న హైజర్ అనే క్లీనర్ త్రాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లి అత్యవసర చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కక్షసాధింపు విడనాడి సంక్షేమంపై దృష్టిసారించండి:నెదురుమల్లి


పేచి రాజాను పరామర్శిస్తున్న రామ్ కుమార్

వెంకటగిరి, జూలై 18 ప్రభాతవార్త: కక్ష సాధింపు వీడి సంక్షేమం అభివృద్ధిపై దృష్టి సాధించాలని ఎన్డీఏ ప్రభుత్వానికి వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి లోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో అక్రమ కేసులు, వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడితే జిల్లా ఎస్పి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాజంపేట ఎంపి మిధున్ రెడ్డి, మాజీ ఎంపి రెడ్డప్ప నివాసానికి వెళ్లిన సందర్భంగా పోలీసుల ఎదుట టిడిపి నాయకులు వైఎస్ఆర్‌సిపి శ్రేణులపై రాళ్లతో దాడులు చేయడం హేయమైన చర్యని పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ ఎంసి చైర్మన్ మధుసూధన్ రెడ్డి, నాయకులు శ్రీనివాస రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, కాసర రంగనాథం, మల్లికార్జున ఉన్నారు.

## మోటార్ వెహికల్ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగిఉండాలి

గూడూరు, జూలై 18 ప్రభాతవార్త : మోటార్ వెహికల్ యాక్ట్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్న ఉద్దేశ్యంతో న్యాయశాఖ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం తెలిపారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని హెల్మెట్ వినియోగించడం వలన కలుగు ప్రయోజనాలను వివరిస్తూ గూడూరు న్యాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా గూడూరు రెండవ పట్టణ పరిధిలో ఉన్న కోర్టు భవనముల సముదాయం వద్ద హెల్మెట్ ధరించాలి అనే నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కోర్టు నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ లోకనాథం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సులోచన రాణి, న్యాయవాదులు, గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, రవాణాశాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి



శ్రీకాళహస్తి, జూలై 18 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన స్వయంభువును గురువారం ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి పరివారంతో దర్శించుకున్నారు.వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎసి మల్లికార్జున్ ప్రసాద్ సారథ్యంలో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాయల దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద ఆలయ మర్యాదలను అందించారు. స్వామి మాట్లాడుతూ పంచభూత లింగాల్లో వాయులింగే శ్వరుడు స్వయం భువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తుల తాకిడి పెరిగిందని ఇంకా పెరుగుతుం న్నారు. ఆయనతో పాటు ఏర్పేడు తెలుగుదేశం నాయకుడు పొన్నారావు,నాగేశ్వరరావులు ఉన్నారు.

## కూరగాయల మార్కెట్ వేలంలో రూ. 3 కోట్ల 21 లక్షలు

తిరుపతి కార్పొరేషన్, జూలై 18 ప్రభాతవార్త : తిరుపతి నగరంలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో రుసుం వసూలు చేసుకొనుటకు నిర్వహించిన వేలం పాటలో 3 కోట్ల 21 లక్షలకు గీత అనే మహిళ వేలం పాటను దక్కించుకున్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అధితి సింగ్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ఆధ్వర్యంలో గురువారం ఇందిరా ప్రియదర్శిని కూరగాయాల మార్కెట్లో రుసుం వసూలు చేసుకొనుటకు జరిగిన బహిరంగ వేలంలో జరిగిన పాటలో గీత అనే మహిళా అత్యధికంగా 3 కోట్ల 21 లక్షలు పాట పాడి వేలం దక్కించుకోవడం జరిగింది. అదే విధంగా గాంధీ రోడ్డు మరికొన్ని రోడ్లపై పార్కింగ్ రుసుం వసూలు చేసుకొనుటకు జరిగిన బహిరంగ వేలంలో 13 లక్షల 5 వేల రూపాయాలతో ప్రకాష్ అనే వ్యక్తి పాటను దక్కించుకోవడం జరిగింది. భారతీ బస్టాండ్ పార్కింగ్ రుసుము వసూలు చేసుకొనుటకు 4 లక్షల 75 వేలతో శరత్ బాబు, అదే విధంగా గోవిందరాజు స్వామి మాడా వీధుల్లో పార్కింగ్ రుసుం వసూలు చేసుకొనుటకు 93200 రూపాయిలతో మునికృష్ణ రెడ్డి వేలంలో పాటను దక్కించుకోవడం జరిగింది. వేలం పాటలో రుసుము వసూలు చేసుకొనుటకు 8 నెలలు మార్చి 31, 2025 వరకు మాత్రమే అధికారికంగా అనుమతి ఇచ్చినట్లు మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అతిధి సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కెఎల్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

## అరసనపల్లెలో నకిలీ వైద్యశాల సీజ్

**జిల్లా వైద్య బృందం క్రిమినల్ కేసులకు సిఫార్సు**



గంగవరం, జూలై 18 ప్రభాతవార్త : మండలంలోని కలగటూరు పంచాయతీ అరసనపల్లె గ్రామంలో నకిలీ వైద్యశాలను జిల్లా వైద్య బృందం సీజ్ చేశారు. పాతికేళ్ళకుపైగా చెలామణీలో ఉన్న నకిలీ వైద్యుని నిర్వాకంపై గురువారం రెండవ రోజు విచారణ జరిపిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ బృందం పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో ముగింపు పలికారు. ఈ నెల 15న 'ఆర్ఎంపీ డాక్టర్ వైద్యం.. అనంతలోకాలకు పయనం..! భర్త ఆదేశాలతో..ఇంజక్షన్ వేసిన భార్య..గాలిలోకి కలిసిన ప్రాణం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసిన వైనం' అనే శీర్షిక వార్త దినపత్రికలో ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే.బాధితులు తమ కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడానికి కారణమైన డూప్లికెట్ డాక్టర్‌పై,ఇతని భార్య ప్రమీలమ్మలు న్యాయం చేయకపోగా వారి కుమారుడు ప్రసాద్‌రెడ్డి దళితులమనే చిన్నచూపుతో మాది బలమైన సామాజిక వర్గమని,మాకు రాజకీయ నాయకుల పలుకుబడి ఉందని, మీరు పోలీస్‌స్టేషన్‌లో కాకపోతే కోర్టులో కూడా పోయి కేసు పెట్టుకోపోండి అంటూ అవహేళన చేశారని బాధితులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నకిలీ వైద్యునిపై విచారణ జరిపి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతుండడంతో అధికారులు వైద్యశాలకు నోటీసులు అతికించి జప్తు చేశారు.అధికారులు నకిలీ వైద్యశాలను సీజ్ చేసి క్రిమినల్ కేసులకు జిల్లా కలెక్టర్‌కు,డిఎంఅండ్‌హెచ్‌వోకు సిఫార్సు చేయడంతో సదరు నకిలీ వైద్యుడు గోపాల్‌రెడ్డి అధికారుల సమక్షంలో తన నివాసంలోని విద్యుత్ వైర్లను లాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి హైడ్రామాకు తెర లేపడం కొస మెరుపు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి జి వెంకటప్రసాద్,జిల్లా నోడల్ అధికారి శిరీష, డిఎంవో జయరాముడు,గంగవరం వైద్యాధికారులు శ్రీనివాసులు,లహరి,కలగటూరు విఆర్ఓ గౌరి,సిహెచ్ఓ మనోరమ,కానిస్టేబుల్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి : జిల్లా ప్రధాన న్యాయమూర్తి



చిత్తూరు టౌన్, జులై 18 ప్రభాతవార్త: ద్విచక్రవాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టులో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెన్నెల, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లోకనాధరెడ్డిలతో కలిసి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలు నడిపే అందరు హెల్మెట్ ధరించాలన్న విషయంపై చేపట్టిన అవగాహన ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనం నడుపాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాల్లో ఎక్కువ మంది మృతి చెందుతున్నారన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారి వల్లే 90 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా యన్నారు. ఈ రోడ్డు ప్రమాదాలను పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయాలంటే క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు అవసరమని హైకోర్టు గుర్తించి ఈ మేరకు ఆదేశించిందన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ లోకనాధరెడ్డి మాట్లాడుతూ మనిషి జీవితం విలువైనదని, కళాశాలకు వెళ్ళే యువత ద్విచక్రవాహనాల్లో వేగంగా వెళ్తుంటారని, వారు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతుంటా రన్నారు. ఈ ర్యాలీ జిల్లా కోర్టు నుండి హైరోడ్డు మీదుగా పిసిఆర్ కళాశాల జంక్షన్ నుండి గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో న్యాయ అధికారులు, న్యాయవాదులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## నాణ్యతపాటించని హోటల్‌పై కొరఢా



తిరుమల,జులై 18ప్రభాతవార్త: నాసిరకం ఆహారం...నాణ్యత లేని కూరగాయలు, పరిశుభ్రత పాటించిన హోటళ్ళు...ఇదీ పుణ్యక్షేత్రం తిరుమల కొండపై జరుగుతున్న వ్యాపారుల అక్రమాలు. వరుసగా వీటిపై భక్తుల నుండి టిటిడి అధికారులకు ఈమెయిల్ ఫిర్యాదులు రావడంతో ఏకంగా టిటిడి ఈఓ జె.శ్యామలరావు, ఫుడ్‌సేఫ్టీ విభాగం ఎఫ్ఎస్‌డి డైరెక్టర్ పూర్ణచంద్రరావుతో కలసి తిరుమలలోని కౌస్తుభం విశ్రాంతి భవనం సమీపంలోని బాలాజీ భవన్ హోటల్‌ను గురువారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో హోటల్‌లో తయారుచేస్తున్న ఆహారపదార్థాలు, ముడిసరుకుల నిల్వ, బంగాళాదుంపలు, కాలీఫ్లవర్, కొన్ని కిరాణా సామాగ్రితో సహా నాసిరకంగా ఉన్నట్లు గుర్తించారు.

## అక్రమార్కులకు అడ్డా మారిన డి.వి.సత్రం

**-ఇసుక,గంజాయి,రేషన్‌బియ్యం అక్రమ రవాణా-విచ్చలవిడిగా కోడిపంద్యాలు-లక్షల్లో బెట్టింగ్‌లు**

దొరవారిసత్రం జూలై 18 ప్రభాతవార్త ; తమిళనాడు–నెల్లూరు–తిరుపతిలకు కేంద్ర బిందువైన దొరవారిసత్రంలో ప్రతిరోజు ఏదొఒకచోట అణునిత్యం ఇసుక, గంజాయి, రేషన్‌బియ్యం, గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతున్న నియంత్రిం చడంలో పోలీసులు విఫలమౌతున్నారన్న విమర్శలు ప్రజల నుండి వ్యక్తమౌ తున్నాయి. వెదురుపట్టు, వేటగిరిపాళెం, మోదుగులపాళెం, తుంగమడుగు, గ్రామాల సమీపంలో ఉన్న కాళంగినది నుండి కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రాత్రిసమయంలో ట్రాక్టర్లు ద్వార ఇసుక మాఫియాకు పాల్పడుతున్నారు.అదే విధంగా సూళ్లూరుపేట నియోజకవర్గంలో సేకరించిన రేషన్‌బియ్యంను దొరవారిసత్రం మండలంలోని నెలబల్లి,కలగుంట గ్రామాల్లో బారీస్థాయిలో నిల్వచేసి అక్కడ నుండి రాత్రిసమయంలో లారీలు ద్వార నెల్లూరుకు అక్రమంగా రవాణా చేస్తున్న పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొంతమంది అక్రమార్కులు తమస్వార్ధ ప్రయోజనాల కోసం ఇతర రాష్ట్రాల నుండి సేకరించిన గంజాయిని ఇక్కడకు తీసుకొచ్చి యువతకు సర్పరా చేయడం ద్వార యువత మత్తుకు అలవాటుపడి ఆమైకంలో బాలికలపై అత్యాచారాలకు తెగబడుతున్నారు.దీనికి ఉదాహరణ బుధవారం నెలబల్లి అటవిప్రాంతంలో బాలికపై అత్యాచారంచేసి దారుణంగా హత్యచేసిన సంఘటనే,అదేవిదంగా తమిళనాడు నుండి కోళ్ళవ్యార్ధాలను నెల్లూరు ప్రాంతంలోని చేపల చెరువులకు అక్రమంగా తరళిస్తూన్న అరికటాల్సిన పోలీసులు నెలసరి మామ్ములతో సరిపెట్టుకుంటున్నారు.

**విచ్చలవిడిగా కోడిపంద్యాలు-లక్షల్లో బెటింగ్‌లు:**

దొరవారిసత్రం మండలంలోని వడ్డికండ్రిగ గ్రామానికి చెందిన కోడిపంద్యాల జూదరుడు గతకొంత కాలంనుండి తమిళనాడు నుండి కోడిపంద్యాల సామాగ్రిని తీసుకొచ్చి యంత్రాలతో కోడికత్తులు తయారుచేస్తూ జూదరులకు విక్రయిస్తూ న్నాడు. అంతేకాకుండ మండలంలో ఆది– సోమ– మంగళ వారాల్లో ఏదొఒకచోట అటవి ప్రాంతంలో విచ్చలవిడిగా కోడిపంద్యాలు నిర్వహిస్తున్నాడు. ఈ కోడి పంద్యాలకు తమిళనాడు, తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరు ప్రాంతాల నుండి జూదరులు ఇక్కడకు చేరుకొని కోడి పంద్యాలపై లక్షల్లో బెట్టింగ్‌లు కడుతూ ఘర్షణలకు దిగుతున్నారు. కోడి పంద్యాలు, కోడికత్తుల తయారుపై స్థానిక పోలీసులకు పిర్యాదు చేసిన వారుమాత్రం పట్టించుకోకుండా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నాతాధికారులు స్పందించి దొరవారిసత్రంలో జరుగుతున్న అక్రమ రవాణా, కోడిపంద్యాలును అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## అల్లాతాత దర్గాకు పోటెత్తిన సందర్శకులు

తడ, జూలై 18 ప్రభాతవార్త : తడ మండలం వేనాడు దీవిలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన అల్లాతాత దర్గాకు గత రెండురోజులుగా సందర్శకులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చారు. నెల్లూరులో జరుగుతున్న బారాషహీద్ దర్గా రొట్టెల పండగకు వచ్చే సందర్శకులు పెద్దసంఖ్యలో వేనాడు దీవికి చేరుకొని ఇక్కడ అల్లాతాతగా పిలిచే ఖాదర్‌వలి పెద్దదర్గాను, చిన్నదర్గాను దర్శించుకున్నారు. బుధవారం రాత్రి రద్దీ ఎక్కువైంది. గురువారం కూడా భక్తులు వందల వాహనాలలో చేరుకున్నారు. వేనాడు రోడ్డు సక్రమంగా లేక ఇటీవల వర్షాలకు దెబ్బతినడంతో కొంత ఇబ్బందులు తప్పలేదు. దర్గా నిర్వాహకులు పారిశుధ్యం పనులతో పాటు మంచినీటి సౌకర్యం కల్పించారు. శుక్రవారం ఈ రద్దీ మరింత ఎక్కువవుతుందని గ్రామస్థులు తెలిపారు.

## శ్రీవారి సేవలో ఎమ్మెల్యేలు



తిరుమల,జులై 18ప్రభాతవార్త: ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడంతో మనసు ఎంతో సంతోషంగా ఉందని టిడిపి ఎమ్మెల్యేలు తెలిపారు. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్, వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో గురువారం వెంకన్నను దర్శించుకుని తీర్థప్రసాదాలుఅందుకున్నారు.

## చంద్రగిరి ఏరియా ఆసుపత్రిలో ఎంఎల్‌సి

**ప్రమాద మృతదేహాలకు పోస్టుమార్టం : ఎంఎల్ఏ పులివర్తి నాని**



చంద్రగిరి, జూలై 18 ప్రభాతవార్త: చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో ఇకపై ఎంఎల్‌సిలు నిర్వహించ నున్నట్లు వైద్య సిబ్బ ంది, ప్రజల హర్షధ్వానాల నడుమ ఎంఎల్ఏ పులివర్తి నాని ప్రకటిం చారు. ఒకప్పుడు కేవలం ఓపిలకే పరిమితమై దశాబ్ద కాలానికి పైగా ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది తమ ఉత్తమ సేవలతో క్రమంగా రోగుల సంఖ్య పెంచుకున్నారు. ఈ నేపధ్యంలో పులివర్తి నాని గత టిడిపి పాలనలో ఏరియా ఆసుపత్రికి 50 పడకలు జీఓను తీసుకువచ్చారు. సార్వత్రిక ఎన్నికలలో భారీ విజయాన్ని అందించిన ప్రజలకు తనవంతు ఏదైనా చేయాలనే సత్సంకల్పంతో ఎంఎల్ఏ పులివర్తి నాని వేగంగా ముందడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక పూజలతో ఎంఎల్‌సి (పోస్టుమార్టం గదులను) కోసం ఫ్రీజ్‌ల గదులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూతలపట్టు–నాయుడుపేట, మదనపల్లి–తిరుపతి జాతీయ రహదారులపై తరచూ జరుగుతున్న ప్రమాదాలతో వేలాదిగా అశువులుబాస్తున్న ప్రయాణికుల ప్రాణాలను కాపాడేం దుకు అనువుగా ఏరియా ఆసుపత్రిని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో ఎవరైనా మరణిస్తే తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో పోస్టుమార్టం నిర్వహించుకునే వెళ్ళాల్సివుందన్నారు. ఇకపై హైవే ప్రమాద క్షతగాత్రులకు శీఘ్రతగతిన మెరుగైన వైద్యం అందించి ప్రాణాలను కాపాడటం, ఎవరైనా మరణిస్తే వారి మృతదేహాలకు ఇక్కడే పోస్టుమార్టం నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో ఏ ఒక్కరూ మరణించకూడదని ఆయన కోరుకున్నారు. ఈ క్రమంలో సిఐ రామయ్య రోడ్డు ప్రమాదాలలో మరణించిన వారి భౌతికదేహాలను తరలించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎంఎల్ఏ దృష్టికి తీసుకువచ్చి, ఒక వాహనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీంతో స్పందించిన ఎంఎల్ఏ వేదికపై నుండి ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావుకు ఫోన్‌చేసి ఒక వ్యాన్‌ను ఎంపి కోటాలో వితరణ చేయాలని కోరడంతో ఎంపి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మారుతి, టిడిపి నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, గౌస్‌భాషా, వీరంగారి రమేష్ రెడ్డి, కొందూరు ప్రవీణ్ రాయల్, సక్కుర్ ధనంజయ రెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, శానంబట్ల తులసి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ వాసు, సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, డాక్టర్ కవిత, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ పావన్,డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ కీర్తి, డాక్టర్ చూప్మ, డాక్టర్ హేమంత్ కృష్ణ, హోమియోపతి వైద్యులు డాక్టర్ పద్మజ, హెడ్‌నర్స్ కళావతి, ఆర్‌హెచ్‌టిసి మండల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శశికళ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

## చెత్త కుప్పలో పనిచేస్తున్న బాలుడు!

వాకాడు, జులై 18 ప్రభాతవార్త : మండల పరిధిలోని వాకాడులో కనబడిన ఈ ఘటన చూసేవారికి హృదయాన్ని చలింపజేసింది. వివరాలు మేరకు సరస్వతి కటాక్షం నోచుకోని చెంచయ్య చిరుప్రాయంలోనే బాధ్యతగా పనులు చేసుకుంటున్నాడు. తల్లిదండ్రులు ఒడిలో కూర్చొని కమ్మని లాలిపాటలు వింటూ బడిలో గురువుల వద్ద పలకపై ఓనమాలు దిద్దాల్సిన చేతులు నేడు మురికి చెత్తకుప్పల్లో ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ డబ్బాలు డిస్పోస్ గ్లాసులు ఏరుకుంటూ కనిపించాడు. దారిన పోయే స్థానికులకు ఈ సంఘటన చూసి కన్నీళ్లు తెప్పించక మానదు. సంబంధించిన అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం పూజలు



చౌడేపల్లి, జూలై 18 ప్రభాతవార్త : స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు పృద్వీనవీన్‌చే స్వామివారికి ఉదయాన్నే విశేషాభిషేకం, అలంకరణగావించారు. అనంతరం కాగడా, హారతులతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లింది. ఉభయదారులచే భక్తులకు స్వామివారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## కంటి సమస్యలతో బాధపడేవారిని గుర్తించి స్క్రీనింగ్ చేయాలి :జిల్లా కలెక్టర్



కుప్పం, జూలై 18 ప్రభాతవార్త:కుప్పం నియోజకవర్గంలో ఇంటింటి సర్వేలో భాగంగా కంటా సమసమస్యలతో బాధపడేవారిని గుర్తించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్‌తో కలసి నియోజకవర్గ వైద్యాధి కారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పంలో ఉన్న వైద్యాధికారులు వారి పరిధిలో గల ఆశ, ఎఎన్‌ఎంల సమన్వయంతో ఇంటింటి సర్వే చేపట్టి కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించాలని అనంతరం కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వారికి ఉచిత ఆపరేషన్లు నిర్వహించేందుకుచర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పిహెచ్‌సిలు, ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు సత్వరమే అందించాలని ఆదేశించారు. కాగా కుప్పం అర్బన్‌లో 2, రామకుప్పం3, గుడుపల్లె 2, శాంతిపురం2, కుప్పం మండలంలో 4 పిహెచ్‌సిలు కలవని ప్రతి పిహెచ్‌సిలో ఇద్దరు వంతున డాక్టర్లు ఉన్నట్లు డిఐఓ అనిల్‌కుమార్ కలెక్టరుకు వివరించారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఏరియా ఆస్పత్రి ఎంఎస్ డా॥ విజయకుమారి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## సంస్కృత వర్శిటీలో రెండు రోజుల జాతీయ సదస్సు



తిరుపతి విద్య, జులై 18 ప్రభాతవార్త : సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కాళిదాస సాహిత్యంలో సాహిత్య, కావ్య సౌందర్యం, వైజ్ఞానిక వైభవం అనే అంశం పైన రెండు రోజుల పాటు జాతీయ సదస్సును విశ్వవిద్యాలయంలో ప్రముఖ చెలికాని అన్నారావు సభా భవనం నందు గురువారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రారంభిక వక్తగా సాహిత్య అకాడమీ సంస్కృత పరామర్శ మండల సంయోజకులు, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, భూత పూర్వ ఉపకులపతి ప్రొ. హరేకృష్ణ శథపతి విచ్చేసి సాహిత్య శాస్త్రంలో ఉన్నటువంటి సాహిత్య మహత్త్యం, కావ్య సౌందర్యం, వైజ్ఞానిక వైభవం, సౌందర్య శాస్త్రం మొదలైనటువంటి వైజ్ఞానిక సంబంధిత అంశాలపైన ఆయన ఉపన్యసించడం జరిగింది. శ్రీ వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం భూతపూర్వ ఉపకులపతి ప్రొ. ఎస్. సుదర్శన్ శర్మ మాట్లాడుతూ సంస్కృత శాస్త్రాల్లో ప్రాచీన కవుల ద్వారా ఎన్నో వైజ్ఞానిక అంశాలను విపులంగా విశదీకరించడం జరిగిందని వివరించారు. మహాకవి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలో ప్రకృతి వర్ణన ద్వారా ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ ఏ విధంగా చేయాలి అనే అంశాన్ని చాలా మధురంగా, సరళంగా వర్ణించడం జరిగింది. ప్రొఫెసర్ కె. రామసూర్యనారాయణ మాట్లాడుతూ సాహిత్య శాస్త్రంలో అనేకమైనటువంటి వైజ్ఞానిక అంశాలు వర్ణించడం జరిగిందని అందులో ప్రత్యేకించి అభిజ్ఞానశాకుంతలంలో, ఉత్తర రామచరితాది ఇతర కావ్య గ్రంథాలలో కూడా సందర్భాన్ని అనుసరించి చాలా మధురంగా, సంస్కృత భాషలో భారతీయ వైజ్ఞానికత తత్వాలను చక్కగా వర్ణించడం జరిగిందని ఆయన తెలిపారు. అనంతరం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సాహిత్య శాస్త్రాది గ్రంథాలలో ఉన్న వైజ్ఞానికత అంశాలను వెలికి తీసి భావితరానికి అందించడమే లక్ష్యంగా ఇటువంటి జాతీయ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని విమర్శించారు. పూర్వం కూడా ఐకెఎస్ ఆధ్వర్యంలో వారం రోజులు పాటు ప్రత్యేకించి భారతీయ సంస్కృత శాస్త్రాలలో ఉన్నటువంటి వైజ్ఞానిక అంశాలపైనే విభిన్న విశ్వవిద్యాలయాల నుండి వచ్చినటువంటి అధ్యాపకులకు ఇక్కడ ప్రశిక్షణం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహిత్య విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ కె. రాజగోపాలన్, డాక్టర్ భరత్ భూషణ్, రథ్ కోఆర్డినేటర్స్ విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.